29. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 293 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



- లోక్ భవన్ కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కేంద్ర మంత్రి భేటీ
- గవర్నర్ బాధ్యతలు స్వీకరించాక తొలిసారి శుక్లాను కలిసిన బండి సంజయ్
- గవర్నర్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి, బిజెపి నాయకులు జె సంగప్ప

హైదరాబాద్ వెలుతురు మార్చి 28:



## మూసీని అడ్డుకుంటే శివతాండవమే

- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

**రంగారెడ్డి,మార్చి28 వెలుతురు:**
రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. 2 లో..

## ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో



- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్
- మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ
- రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు
- అక్రమాలను సహించేది లేదని వెల్లడి
- ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్,మార్చి28 వెలుతురు:**
హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని 2 లో..

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

- పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ
- అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత



**హైదరాబాద్,మార్చి 28 వెలుతురు:**
దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు 2 లో..

## ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ గడువు

- ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక

**హైదరాబాద్, వెలుతురు మార్చ్ 28:**



తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక సూచించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె పలు 2 లో..

## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం






**హైదరాబాద్,మార్చి 28 వెలుతురు:**
ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా 3 లో..

## నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుతో సీఎంలో డిప్రెషన్ మొదలైంది

- ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారు
- దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించాలనుకుంటున్నారు
- 6 గ్యారంటీలపై ధ్రుష్టి మళ్లించేందుకు అనేక డ్రామాలాడుతున్నారు
- కాళేశ్వరం డిజైన్ లోపం బాధ్యత కేసీఆర్ దే
- కేసీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు
- అందుకే కేసీఆర్ కుటుంబం సహా బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం లేదు
- కవిత పార్టీని స్వాగతిస్తున్నాం...



- ప్రజల కోసం, పేదల కోసం పనిచేస్తేనే ఏ పార్టీకైనా గుర్తింపు
- సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్...

**కరీంనగర్ వెలుతురు మార్చి 28:**
నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేసేందుకు సిద్ధమవ్వడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో డిప్రెషన్ మొదలైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందుకే 2 లో..




## అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం


- నెయిడా జేవర్‌లో దేశంలోనే అతిపెద్ద విమనాశ్రాయం
- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ
- నోయిడా మూఢనమ్మకాన్ని చెరిపేసామని వ్యాఖ్య
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా చర్యలు



**న్యూఢిల్లీ,మార్చి 28 వెలుతురు:**
మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. విపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో 2 లో..

## ఇక అమరావతి ప్రజారాజధాని

- విభజన సమయంలో బస్సులోనుంచి పాలన,
- 9 నెలల కాలంలో సచివాలయం, అసెంబ్లీ నిర్మాణం,
- భూములు ఇచ్చిన రైతులకు శిరసు వంచి నమస్కారం,
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ఉద్వేగ ప్రసంగం,
- అమరావతి రాజధాని కోసం ఏకగ్రీవ తీర్మానం ఆమోదం



**అమరావతి,మార్చి 28 వెలుతురు:**
ప్రజా రాజధాని అమరావతి అని.. తీర్మానం ఆమోదం తర్వాత కేంద్రానికి పంపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏపీ అసెంబ్లీలో రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇకపై రాజధాని అమరావతికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. శాతవాహనులు 2 లో..

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని.. అది అమరావతి

- గతంలో మూడు రాజధానుల పేరిట వైసిపి నాటకాలు
- భూములు ఇచ్చిన రైతులను కేసులో హింసించారు
- బలమైన నాయకుడు చంద్రబాబు వల్లనే అభివృద్ధి సాధ్యం
- అందుకే కూటమి కట్టి ఎన్నికల్లో పోటీ చేశాం
- అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,మార్చి 28 వెలుతురు:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. 2 లో..



వెలుతురు

## ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి జర్నలిస్టులకు అక్రెడిటేషన్ గడువు

వివరాలు వెల్లడించారు. జర్నలిస్టులు తమ యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతో పాటు అవసరమైన పేపర్ కటింగులు విద్యార్హతల సర్టిఫికెట్లు ఇండిపెండెంట్ జర్నలిస్టులు కటింగ్లతో పాటు సంబంధిత ఎడిటర్ పత్రికకు వార్తలు రాసినట్లు ధ్రువీకరించే లేఖ సంబంధిత అర్హత పత్రాలను జత చేయడంతో పాటు తాము వేరే ఇతర వృత్తులలో అనగా సొసైటీ చైర్మన్, డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగం, న్యాయవాద వృత్తి, సర్పంచ్ తదితర ఇతరత్రా ఏ పదవుల్లో కొనసాగడం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ జతచేసి హార్డ్ కాపీని సంబంధిత డిపిఆర్ఓ కార్యాలయాలలో అందజేయాలని, అప్లికేషన్ను పూర్తి చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై సంబంధిత అధికారులకు కఠిన చర్యలకై ఆదేశాలు ఇవ్వనున్నట్లు స్పెషల్ కమిషనర్ వెల్లడించారు ఇప్పటికే రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ రెండు సార్లు సమావేశమై జీఓ అమలు, విధి విధానాలపై చర్చించిందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను సమీక్షిస్తూ, అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేసే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## మూసీని అడ్డుకుంటే శితాండవమే

మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద




బ్రేక్ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని..అది అమరావతి

వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చలో శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించ లేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశించారన్నారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా.. ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలచుకుంటే బాధేస్తోంది. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక.. అమరావతిపై కక్ష కట్టారు. అమరావతి రైతులకు మద్దతుగా నేను వెళ్తే.. ముళ్ల కంచెలు వేశారు. వైకాపా హయాంలో శాసనసభ్యులకే రక్షణ లేకపోతే.. రైతులకు ఎలా ఉంటుంది? రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైకాపా హయాంలో హింసించారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. రాజధాని సమస్యను పరిష్కరించకపోగా.. కఠినం చేశారు. వైకాపా మళ్లీ వస్తే.. పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైకాపా మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనమంతా ఒకే మాటపై ఉండాలని అన్నారు. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు..దీనికి కట్టుబడి ఉన్నాం. చట్టసభల్లో కూర్చొని దాడులు చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్ను అభివృద్ధి చేసేటప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారు. ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కయ్యారని ఆరోపించేవాళ్లు. రాజకీయ నేత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. దార్శనికుడు ఒక తరం గురించి ఆలోచిస్తాడని పవన్ అన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుతో సీఎంలో డిప్రెషన్ మొదలైంది

ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారని, దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన బాధ్యత కేసీఆర్ దేనని చెప్పారు. అయినప్పటికీ కేసీఆర్ ను, కాళేశ్వరం అవినీతి పరులను రేవంత్ రెడ్డి సర్కార్ అరెస్ట్ చేయడం లేదని అన్నారు. కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కుమ్మక్కవడంవల్లే కేసీఆర్ కుటుంబంసహా బీఆర్ఎస్ నేతల అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. శనివారం రోజున కరీంనగర్ లోని తన నివాసంలో సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసిన కేంద్ర మంత్రి వాటి పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు బండి సంజయ్ బదులిచ్చారు...

**నియోజకవర్గాల పునర్విభజనపై....**

నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్రం అమలు చేస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్రెషన్ లోకి వెళుతున్నారు. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తిపై దిగజారి మాట్లాడుతున్నారు. సీఎం భాషను చూసి తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోంది. ఓట్ల కోసం 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీలిస్తారు. అధికారంలోకి వచ్చాక గాడిద గుడ్డు చూపిస్తారు. లాగుల తొండలు విడుస్తానని అంటారు. ఇదేందని మేం మాట్లాడితే గుండు, బండి అని మాట్లాడతారే తప్ప ఆ హామీలను అమలు చేయాలనే సోయే ఉండదు.

**కవిత కొత్త పార్టీపై అడిగిన ప్రశ్నకు....**

ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చు. స్వాగతిస్తాం. అయితే ప్రజల కోసం, పేదల కోసం ఏ పార్టీ పనిచేసినా ఆ పార్టీకే మనుగడ ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**కాళేశ్వరం డిజైన్ లోపంపై....**

కాళేశ్వరం డిజైన్ లోపానికి ప్రధాన కారకులు కేసీఆరే. ఎందుకంటే ఆయన ఇంజనీర్ అవతారమెత్తారు. అనేక వేషాలు వేసి డిజైన్లు తయారు చేశారు. కాబట్టి దీనికి ప్రధాన బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం కాళేశ్వరం డిజైన్ కారకులను, అవినీతిపరులను అరెస్ట్ చేయడం లేదు. ఎందుకంటే కేసీఆర్ తో రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యారు. అందుకే అవినీతికి పాల్పడినా, డిజైన్ లోనే లోపముందని తేల్చినా చర్యలు తీసుకోవడం లేదు. ఇదేమని అడిగితే కేంద్రంపై నెపం మోపి తప్పించుకోవాలని చూస్తున్నారు. సీబీఐకి పంపిన లేఖలోనూ పూర్తిస్థాయిలో వాస్తవాలు చెప్పలేదు.


**డీలిమిటేషన్ తో దక్షిణాదిరాష్ట్రాలకు అన్యాయంపై....**

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి జరిగే నష్టం ఏమిటో ఇప్పటి వరకు సీఎం చెప్పలేదు. ఏ ప్రాంతానికి అన్యాయం జరగదు. అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచుతున్నప్పుడు దక్షిణాదికి అన్యాయం ఎట్లా జరుగుతుంది? 6 గ్యారంటీల అమలు చేయడం చేతగాక ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ డ్రామాలాడుతున్నరు. మహిళలకు నెలకు రూ.2500లు, వృద్దులకు రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రైతు భరోసా, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, మహిళలకు తులం బంగారం, స్కూటీ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలి. ముందు వాటి సంగతి తేల్చిన తరువాత మాట్లాడాలి. అంతే తప్ప వాటిని అమలు చేయలేక రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసి ప్రజలను దారి మళ్లించేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ డ్రామాలాడుతున్నారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరించేందుకు సిద్దంగా ఉంది. రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపైన, 6 గ్యారంటీల అమలుపైన దృష్టి సారించాలని కోరుతున్నా.

# మెట్రో విస్తరణకు మార్గం సుగమం

కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్లో మెట్రో నెట్వర్క్ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన ప్రక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్-2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్అండ్టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్అండ్టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్అండ్టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్రావు, ఆయన తండ్రి రవీందర్రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు. రాఘవ కన్స్ట్రక్షన్తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్రావు తమ్ముడు మహేశ్వర్రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

# అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం



నోయిడాను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది. దానిని ఉద్దేశించే మోదీ మాట్లాడారు. గతంలో ఉత్తర్ప్రదేశ్లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజ్వాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోదీజీ నోయిడా వెళ్లొద్దు. మీరు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. అసలు ఈ నమ్మకానికి 1988 జూన్లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తర్ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడా-దిల్లీని అనుసంధానించే డీఎన్డీ రైల్వేను నోయిడా నుంచి కాకుండా దిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం అన్నారు. ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ సమిట్కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్కు చీఫ్గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢనమ్మకాన్ని పట్టించుకోలేదు. ఆయన 2017లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలుమార్లు ఆ నగరంలో పర్యటించారు. ఆ తర్వాత 2022లో రెండోసారి సీఎంగా గెలిచారు. 2027లో మరో దఫా ఎన్నికలకు వెళ్లనున్నారు. ఇకపోతే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్నూ నిర్మించారు. కార్యక్రమంలో యూపి సిఎం యోగి, కేంద్రమంత్రి రమ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇక అమరావతి ప్రజారాజధాని

అమరావతి నుంచే పాలన సాగించారని గుర్తుచేశారు. ఆ కాలం నాటి అమరావతి విశేషాలను బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరిచారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలుగువారిని గతంలో 'మదరాసీలు' అని పిలిచేవారని.. టీడీపీ ఆవిర్భావం తర్వాత మదరాసీ అనే ముద్ర పోయిందని చంద్రబాబు గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటు చేసిన పార్టీ టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. విభజన సమయంలో సమన్యాయం కోసం తాము కోరినట్లు చంద్రబాబు చెప్పారు. ఆనాడు పార్లమెంట్లో జగన్ కనిపించకుండా దాక్కున్నారని విమర్శించారు. విభజన తర్వాత ఏపీలో కార్యాలయాలు లేవని, బస్సులో ఉండి పరిపాలన చేశామని ఆయన వెల్లడించారు. అమరావతిలో అసెంబ్లీ, సచివాలయ భవనాలను కేవలం 9 నెలల్లోనే పూర్తి చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.సింగపూర్ సహకారంతో ఆ స్థాయిలో రాజధాని నిర్మాణం కోసం ప్రణాళికలు ఇవ్వాలని కోరామని సీఎం తెలిపారు. 'ముందు దేశం బాగుండాలి.. అలా ఉండాలంటే మన జాతి బాగుండాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి' అని అన్నారు. తెలుగు వాళ్లకు చెందిన హైదరాబాద్, అమరావతి తొలి రెండుస్థానాల్లో ఉండాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు.

విజయవాడ- గుంటూరు మధ్య రాజధాని పెట్టాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పిందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ వివిధ జాతీయ స్థాయి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి రాజధాని అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తామని చెప్పారని.. కానీ రోజుకో మాట మార్చేసి ఊసరవెల్లి రాజకీయాలు చేశారని సీఎం విమర్శించారు. టెక్నాలజీ అందుబాటులో ఉన్న రోజుల్లోనూ రాజకీయ విన్యాసాలు చేశారన్నారు. వంద ఎకరాలు తీసుకుని భవనాలు కట్టేసి రాజధాని అని చెప్పేయవచ్చని.. కానీ రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరేలా ఓ ప్రాంతం ఉండాలని ఆలోచించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులను సంప్రదించగా 58 రోజుల్లో 34 వేల ఎకరాలను రాజధాని కోసం ఇచ్చేశారన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని సీఎం తెలిపారు. రాజధాని పట్ల కుట్రలు చేసిన కొందరు వక్తులు తోటలకు నిప్పు పెట్టారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకుకు ఈమెయిల్లు పెట్టారని ఫైర్ అయ్యారు. కానీ పవిత్రమైన మట్టి, నీరుతో ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని... అందుకే ఇది శాశ్వతంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# మై భారత్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలు




**హైదరాబాద్, వెలుతురు మార్చి 28:**

యువత దేశాభివృద్ధికి దోహదపడే విధంగా బడ్జెట్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ఆర్ కర్ణన్ పిలుపునిచ్చారు. పాఠ్యపుస్తకాలకే పరిమితమవకుండా వార్తాపత్రికలు, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలోని అంశాలను విశ్లేషిస్తూ ద్రవ్యలోటు, వ్యయ విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ఖర్చులు క్యాపిటల్ ఎక్స్పెండిచర్ వైపు మళ్లుతున్నాయా, లేక రెవెన్యూ ఎక్స్పెండిచర్ వైపు ఉన్నాయా అనే విషయాలను పరిశీలించాలని సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగం పూర్తిగా వ్యక్తి చేతుల్లోనే ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రకటనల ప్రభావానికి లోనుకాకూడదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వయంగా ఆదాయపన్ను దాఖలు చేయడం నేర్చుకోవాలని సూచించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మై భారత్" కార్యక్రమంలో భాగంగా, నేషనల్ సర్వీస్ స్కీమ్ సమన్వయంతో హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్" పోటీలు శని, ఆదివారాల్లో ప్రారంభమయ్యాయి. జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన ప్రతి జిల్లాకు చెందిన ఐదుగురు యువతతో మొత్తం 165 మంది పాల్గొంటున్నట్లు జిల్లా యువజన అధికారి తెలిపారు. "కేంద్ర బడ్జెట్ 2026 యువత బలోపేతానికి వికసిత్ భారత్ 2047 సాధనకు సోపానం" అనే అంశంపై ప్రతి పోటీదారు మూడు నిమిషాల పాటు ఉపన్యసించనున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ జర్నలిస్టు దిలీప్ రెడ్డి, పీఐబి అధికారి శ్రీమతి గాయత్రి, ఐఎఫ్ఎల్యూలో డాక్టర్ కే. రాజారాం, ఐఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ ఉపసంచాలకులు ఎస్. నాగార్జున తదితరులు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ సి హెచ్ అంజిరెడ్డి మాట్లాడుతూ యువత వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.10 లక్షల ప్రమాద బీమా ఖర్చును తానే భరిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు, యువజన అధికారులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం సాయంత్రం జరిగే ముగింపు సమావేశంలో రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

# వైభవంగా శ్రీసీతరామ పట్టాభిషేకం

**- వేడుకలో పాల్గొన్న గవర్నర్ శుక్లా**



**భద్రాచలం,మార్చి 28 వెలుతురు:**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో జయ జయ నీరాజనాల మధ్య దేవదేవుడికి అర్చకులు సమస్త నదీ జలాలతో అభిషేకం చేశారు. ఈ పుణ్య జలాన్ని భక్తులపై చిలకరించి సమస్త లోకాలు శుభాలతో వర్ధిల్లాలని ఆశీస్సులు పలికారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు.

# బిఆర్ఎస్ ఆడే పోటీలను నిర్వహించలేం

**- మత్తు వదిలించుకోవడానికే మైదానానికి రమ్మన్నాం**

**- వారు ఆడలేమంటే..వారి ఆటలు పెట్టలేం కదా**

**- క్రీడాపోటీల్లో పాల్గొనడం లేదన్న కెటిఆర్ వ్యాఖ్యలపై వాకిటి కౌంటర్**

**హైదరాబాద్,మార్చి 28( వెలుతురు):**

తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనబోమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటున్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు. 'మావి వేరే గేమ్స్, కేటీఆర్‌వి మరో రకమైన గేమ్స్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ వాళ్లు ఆడే గేమ్స్ పెట్టడం సాధ్యం కాదు కదా? అంటూ మంత్రి వాకిటి శ్రీహరి చురకలు అంటించారు . తాము ఫిట్ తెలంగాణ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. ఆరోగ్య తెలంగాణ ఉండాలని సీఎం ఆలోచన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు డ్రగ్స్ వంటి ఆలోచనలు రాకుండా ఆటల వైపు మళ్లుతారని వాకిటి పేర్కొన్నారు. కాగా, నేటి నుంచి రెండ్రోజులపాటు జరిగే లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2026లో తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొనరంటూ ఎమ్మెల్యే కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా క్రీడా పోటీలు అవసరమా? అంటూ ప్రశ్నించారు. శాసనసభ సమయం వృథా చేయడం తగదని.. కనీసం ఇంకో 10 రోజులు సమావేశాలను కొనసాగించాలని అన్నారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.

# భద్రాచలంలో గవర్నర్ దంపతులు

**- భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా**



**భద్రాచలం,మార్చి 28( వెలుతురు):**

భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఎ ఆధ్వర్యంలో భద్రాచలంలో - భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

# సమాజ పతనం: అద్దం ముందు నిలబడాల్సిన సమయం ఆసన్నమైందా?



**డా .సూర్యదేవర రామకృష్ణ ,**

9490754169

*నవ సమాజ నిర్మాణంలో ప్రతి వ్యక్తి ఒక ఇటుక వంటివాడు. ఇటుకలు దృఢంగా లేనప్పుడు కట్టడమనే సమాజం కూలిపోవడం ఖాయం. కానీ నేటి పరిస్థితి చూస్తుంటే, మనం ఒక రకమైన సామూహిక బాధ్యతారాహిత్యం లో జీవిస్తున్నామా అనిపిస్తుంది. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నా, సాంకేతికంగా దూసుకుపోతున్నా నైతికంగా మాత్రం పాతాళానికి పడిపోతున్నాం. రాజకీయాల్లో రౌడీయిజం, పరిపాలనలో అవినీతి, సామాజిక జీవనంలో స్వార్థం పెనవేసుకుపోయాయి. ఈ పతనానికి కారణం వెతకడం అంటే ఒక చీకటి గదిలో నల్లపిల్లిని వెతకడం లాంటిది కాదు. అది మన కళ్ళముందే ఉంది. పాలకుల నిర్లక్ష్యం ఒక వైపు అయితే, పాలింపబడే ప్రజల ఉదాసీనత మరోవైపు. ఇది కేవలం రాజకీయ విశ్లేషణ కాదు ఇది మన అస్తిత్వానికి సంబంధించిన ఆవేదన.*

ఇంటి నాలుగు గోడల మధ్య మొదలయ్యే క్రమశిక్షణారాహిత్యం, అసెంబ్లీ హాల్స్ వరకు చేరిందంటే తప్పు ఎక్కడ జరుగుతోంది? మహాత్మా గాంధీ ఒక అద్భుతమైన మాట చెప్పారు నీవు ప్రపంచంలో ఏ మార్పునైతే చూడాలనుకుంటున్నావో, మొదట ఆ మార్పు నీలోనే రావాలి కానీ నేటి నాయకులను చూస్తే ఆ మాట ఒక హాస్యాస్పదమైన నినాదంలా మారిపోయింది. నాయకుడు అంటే సమాజానికి దిక్సూచి. కానీ నేడు ఆ దిక్సూచి ముల్లు కేవలం స్వార్థం, పదవి, అధికారం వైపే మొగ్గు చూపుతోంది.ఒకప్పుడు నాయకత్వం అంటే త్యాగం. అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు తమ రక్తాన్ని, ప్రాణాలను ధారపోసి ఈ సమాజానికి ఒక రూపాన్ని ఇచ్చారు. కానీ నేటి నాయకుల ప్రాధాన్యతలు మారిపోయాయి. ఎన్నికల సమయంలో పంచే డబ్బులు, ఇచ్చే ఉచిత హామీలు, చేసే కుల రాజకీయాలే వారి అస్త్రాలు. కుటుంబ పాలన అనేది ఒక క్యాన్సర్ లాగా ప్రజాస్వామ్యాన్ని లోపల నుండి తినేస్తోంది. ఒక ఎమ్మెల్యే లేదా ఎంపీ తన పదవిని ఒక వ్యాపార పెట్టుబడిగా చూస్తున్నప్పుడు, అక్కడ ప్రజా సేవ అనే పదానికి అర్థం ఎక్కడుంటుంది? అధికార దుర్వినియోగం పరాకాష్టకు చేరింది. నిజాయితీగా పనిచేసే అధికారులను బదిలీ చేయడం, తమకు వత్తాసు పలికే వారిని అందలం ఎక్కించడం ఒక సాధారణ ప్రక్రియగా మారింది. చెట్టు వేరు కుళ్ళిపోతే కొమ్మలు పచ్చగా ఎలా ఉంటాయి? అన్నట్లు, నాయకత్వమే కలుషితమైతే ఆ విషం మొత్తం వ్యవస్థలోకి పాకుతుంది. చట్టాలు చేసేవారే చట్టాలను ఉల్లంఘిస్తుంటే, సామాన్యుడికి న్యాయంపై నమ్మకం ఎలా కలుగుతుంది?నాయకులను నిందించడం చాలా సులభం. కానీ ఆ నాయకులను ఆ కుర్చీలో కూర్చోబెట్టింది ఎవరు? మనమే కదా! ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక బ్రహ్మాస్త్రం. కానీ ఆ అస్త్రాన్ని మనం కేవలం ఒక వెయ్యి రూపాయల నోటుకో, ఒక సారా సీసాకో అమ్ముకుంటున్నామంటే, పతనం అక్కడే మొదలైంది. నీరు రావట్లేదని, రోడ్లు బాగోలేదని గగ్గోలు పెట్టే మనం, ఎన్నికల రోజున ఏ ప్రాతిపదికన ఓటు వేస్తున్నాం?

సమాజంలో అవినీతి పెరిగిపోయిందని వాపోయే సగటు మనిషి, ట్రాఫిక్ చలానా నుండి తప్పించుకోవడానికి కానిస్టేబుల్ చేతిలో వంద రూపాయలు పెడుతున్నప్పుడు ఆ అవినీతిలో భాగస్వామి కాదా? తన బిడ్డకు అర్హత లేకపోయినా సిఫారసులతో ఉద్యోగం సంపాదించాలని చూసే తండ్రి, వ్యవస్థను భ్రష్టు పట్టించడం లేదా? నిజాయితీగా బతికే వ్యక్తిని ఈ సమాజం అమాయకుడు అని పిలుస్తోంది, తెలివిగా అడ్డదారులు తొక్కేవాడిని 'సమర్థుడు' అని పొగుడుతోంది. ఈ ద్వంద్వ నైతికతే నేటి సామాజిక



విషాదం.ప్రజలు మేల్కొననంత కాలం నాయకులు మారుతూనే ఉంటారు తప్ప వ్యవస్థ మారదు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు చట్టసభల్లోకి వెళ్తున్నారంటే, వారికి ఆమోద ముద్ర వేస్తోంది ప్రజలే. ఐదు సంవత్సరాల భవిష్యత్తును ఐదు నిమిషాల ప్రలోభాలకు తాకట్టు పెడితే, ఆ తర్వాత వచ్చే కష్టాలకు ఎవరిని నిందించాలి?ఈ చర్చలో ఒక సంక్లిష్టమైన ప్రశ్న ఎదురవుతుంది ప్రజలు చెడిపోయి నాయకులు చెడ్డారా? లేక నాయకులు చెడిపోయి ప్రజలను చెడగొట్టారా? ఇది ఒక చక్రీయ ప్రభావం. చదువులేని ప్రజలను మోసం చేయడం పాలకులకు సులభం. అందుకే విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కంటే, ఉచితాల పేరుతో ప్రజలను సోమరిపోతులుగా మార్చడంపైనే పాలకులు దృష్టి పెడుతున్నారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం, పౌర జ్ఞానం పెరగకుండా ఉంటేనే తమ పప్పులు ఉడుకుతాయని వారు గ్రహించారు. ఒక చిన్న ఉదాహరణ, ఒక గ్రామంలో రోడ్డు వేశారు అనుకుందాం. కాంట్రాక్టర్ నాసిరకం మెటీరియల్ వాడాడు, ఇంజనీర్ లంచం తీసుకుని సంతకం పెట్టాడు, స్థానిక నాయకుడు తన వాటా తీసుకున్నాడు. ప్రజలు అది చూస్తూ ఊరుకున్నారు. మొదటి వర్షానికే ఆ రోడ్డు కొట్టుకుపోయింది. ఇక్కడ తప్పు ఎవరిది? కేవలం కాంట్రాక్టరుదా? లేక ఆ పనిని ప్రశ్నించని గ్రామస్తులదా? అంటే ఇక్కడ అందరూ బాధ్యులే. అన్యాయాన్ని మౌనంగా భరించడం కూడా నేరమే.సమాజం మారాలంటే పాత చింతకాయ పచ్చడి లాంటి ఉపన్యాసాలు సరిపోవు. కార్యాచరణ కావాలి.నాయకుల్లో జవాబుదారీతనం ఉండాలి నాయకత్వం అంటే ఒక హోదా కాదు, అది ఒక పెద్ద బాధ్యత. ప్రజల సొమ్ముతో విలాసవంతమైన జీవితాలు గడిపే నాయకులు, తాము ప్రజా సేవకులమని గుర్తుంచుకోవాలి. రాజకీయాల్లోకి వచ్చే ముందు ఆస్తిపాస్తుల కంటే నైతిక విలువలను ప్రామాణికంగా తీసుకోవాలి.పౌర చైతన్యం ఉండాలి నేనొక్కడిని మారితే ఏమవుతుంది? అనే నిరాశను వదిలేయాలి. గూటి చుక్కలే కలిసి ఆకాశాన్ని వెలిగిస్తాయి. సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేయడం కంటే, క్షేత్రస్థాయిలో సమస్యలను ప్రశ్నించే ధైర్యం ప్రజల్లో రావాలి. సమాచార హక్కు చట్టం (=×) వంటి సాధనాలను ఉపయోగించుకోవాలి.విద్యా వ్యవస్థలో మార్పు అత్యవసరం కేవలం మార్కుల కోసం చదివే చదువు కాకుండా, విలువలతో కూడిన విద్యను అందించాలి. రాజ్యాంగం పట్ల అవగాహన, పౌర ధర్మాలు చిన్నప్పటి నుంచే నేర్పించాలి. ఎదుటివాడి హక్కును గౌరవించడం, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండడం పాఠ్యాంశాల్లో అంతర్భాగం కావాలి.సమాజం అనేది ఒక పెద్ద అద్దం. మనం ఎలా ఉంటే అది అలాగే కనిపిస్తుంది. మనం నీతిగా ఉంటే ప్రతిబింబం స్వచ్ఛంగా ఉంటుంది, మనం కలుషితమైతే ఆ రూపం వికృతంగా తయారవుతుంది. పాలకులను నిందించే ముందు మనం మన చేతులను ఒకసారి చూసుకోవాలి. అవి శుభ్రంగా ఉన్నాయా?నాయకులు దిశను నిర్దేశించే వారైతే, ప్రజలు ఆ బాటలో నడిచే బాటసారులు. బాట చూపేవాడు దారి తప్పినా, నడిచేవాడు కళ్ళు మూసుకున్నా ప్రమాదం తప్పదు. ఒక గొప్ప సమాజం నిర్మించబడాలంటే నైతిక నాయకత్వం, చైతన్యవంతమైన పౌరసమూహం ఈ రెండు పట్టాల మీద ప్రయాణం సాగాలి. రేపటి తరానికి మనం ఎలాంటి సమాజాన్ని అందిస్తున్నాం? అప్పుల ఊబిలో కూరుకుపోయిన, కులమతాలతో విడిపోయిన, నీతి లేని సమాజాన్నేనా? లేక బాధ్యతాయుతమైన పౌరులున్న గొప్ప దేశాన్నేనా? సమాధానం మన చేతుల్లోనే ఉంది. అవతలి వ్యక్తిని వేలెత్తి చూపడం ఆపి, మన అంతరాత్మను ప్రశ్నించుకుందాం. ఈ సమాజం కోసం నేను ఏం చేస్తున్నాను? అనే ఒక్క ప్రశ్న మనలో కలిగితే, మార్పు అనే సూర్యోదయం అక్కడే మొదలవుతుంది.

# దేశానికి అవసరమైన ఇంధనాన్ని అందించే దిశగా కృషి

**- మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు మార్చి 28:**

మన తెలంగాణ రాష్ట్రంలో గత వారం రోజులుగా పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ సరఫరాలపై ప్రజల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ పంపుల్లో ఇంధనం లేదని చెప్పడం, కొంతసేపు పంపులను మూసివేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితులు ప్రజల్లో భయాందోళనలను కలిగించాయి. అయితే, వాస్తవానికి ఈ పరిస్థితులు మన రాష్ట్రానికి లేదా మన దేశానికి మాత్రమే పరిమితమైనవి కావు. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు వంటి కారణాల వల్ల ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో మనం ఇతర దేశాలపై ఆధారపడుతున్నాము. అందువల్ల ప్రపంచ పరిస్థితుల ప్రభావం మన దేశంపైన కూడా పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా భారత ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు తీసుకుంటోంది. దేశంలో అంతర్గతంగా జరుగుతున్న ప్రాసెసింగ్ (తీవటఱఅఱఅస్త్ర) సామర్థ్యాన్ని పెంచుతూ, అవసరమైన ఇంధనాన్ని దేశంలోనే అందించే దిశగా కృషి జరుగుతోంది. అంతేకాకుండా విదేశాల నుండి రావాల్సిన పెట్రోలియం ఉత్పత్తులను కూడా విజయవంతంగా దిగుమతి చేసుకునే విధంగా ముందుకు సాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా అనేక సమస్యలు ఎదురవుతున్న ఈ సమయంలో, భారత ప్రభుత్వం ప్రతి రోజు




అనేక దేశాల నాయకులతో చర్చలు జరుపుతోంది. దేశానికి అవసరమైన ఇంధనం కొరత లేకుండా ఉండేందుకు, ఇతర దేశాలు నిర్ణయించిన ధరలను చెల్లించి అయినా సరే, పెట్రోల్ మరియు డీజిల్ వంటి ఉత్పత్తులను దేశానికి తీసుకురావడంలో కట్టుబడి ఉంది. ఎందుకంటే దేశ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఇక మన దేశంలో వాహనాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ప్రజల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. గతంలో కట్టెలు, కిరోసిన్ వంటి ఇంధనాలను ఉపయోగించిన ప్రజలు, ఇప్పుడు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎల్పీజీ గ్యాస్‌ను ఉపయోగిస్తున్నారు. "ఉజ్వల పథకం" ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, చిన్న రైతులు కూడా గ్యాస్ సిలిండర్లను పొందగలిగారు.

సబ్సిడీ ద్వారా వారికి మరింత సౌలభ్యం కల్పించబడింది. ఈ పరిస్థితుల్లో మనం ఇంధన వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. అందుకే ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తూ, దేశవ్యాప్తంగా రైల్వేలను విద్యుదీకరణ చేస్తూ, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తోంది. సోషల్ మీడియా విషయానికి వస్తే, ఇది సమాచారం పంచుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో తప్పుడు ప్రచారం ప్రజల్లో భయాందోళనలను పెంచుతోంది. పెట్రోల్ కొరత ఉందనే వదంతులు అనవసరమైన రద్దీకి దారి తీసాయి. అయితే, ఆయిల్ కంపెనీల అధికారులు ఇప్పటికే స్పష్టం చేసినట్లుగా, తెలంగాణలో పెట్రోల్, డీజిల్ లేదా వంట గ్యాస్ కొరత ఏమీ లేదు. దేశవ్యాప్తంగా సరఫరాలు సక్రమంగా కొనసాగుతున్నాయి. కాబట్టి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అందువల్ల మనం అందరం శాంతంగా ఉండి, వదంతులను నమ్మకుండా, బాధ్యతతో వ్యవహరించాలి. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను ఐక్యంగా ఎదుర్కొంటేనే మనం విజయాన్ని సాధించగలం.

# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు.

క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# సంపాదకీయం.. ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్‌ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్




తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది.

1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది.

అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

## మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

**- 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు**




**లాస్‌ఏంజిల్స్,మార్చి28( వెలుతురు):** ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం దారుణం

**- డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారు**

**- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి**



**హైదరాబాద్,మార్చి28( వెలుతురు):** కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్‌కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. జగదీశ్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. తప్పు చేసి సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ కమ్ బ్జడెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్‌లు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బ్జడెట్ బుక్ ఒకేలా కాపీ పెస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్‌లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు నేరమే అని స్పష్టం చేశారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

## గిరిజనులకు గొప్ప హామీల హంగామా.. అమలులో దగా..!



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

*ప్రజాస్వామ్యం అనే వ్యవస్థ కేవలం ఓట్లతో ప్రభుత్వాలను మార్చే ప్రక్రియ మాత్రమే కాదు, అది ప్రజల ఆశలతో నిర్మితమైన విశ్వాస వ్యవస్థ. ముఖ్యంగా అణగారిన వర్గాలైన దళితులు, గిరిజనులు ఎన్నికలను తమ భవిష్యత్తును మార్చే అవకాశంగా చూస్తారు. ఈ వర్గాలకు ఇచ్చే ప్రతి హామీ వారి జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపే ఒక నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టడం ఏ ప్రభుత్వానికైనా నైతిక బాధ్యత.*

తెలంగాణలో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల్లో గిరిజన వర్గాల ఆశలు, ఆకాంక్షలు ఒక ప్రత్యేక దిశలో వెళ్లాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన "ఆరు గ్యారెంటీలు", చేవెళ్ల డిక్లరేషన్ వంటి హామీలు గిరిజన సమాజంలో ఒక కొత్త ఆశను రేకెత్తించాయి. ముఖ్యంగా "దళిత బంధు" తరహాలో "గిరిజన బంధు" పథకాన్ని అమలు చేస్తామని చెప్పడం గిరిజన కుటుంబాల్లో ఆర్థిక స్వావలంబనపై ఒక బలమైన నమ్మకాన్ని పెంచింది.

దళిత బంధు పథకం కింద ఒక కుటుంబానికి రూ.10 లక్షల వరకు నేరుగా ఆర్థిక సహాయం అందించిన నమూనాను గిరిజనులకూ వర్తింపజేస్తామని చెప్పడం చిన్న విషయం కాదు. తెలంగాణలో సుమారు 10 లక్షల గిరిజన జనాభా ఉండగా, కనీసం 3 లక్షల గిరిజన కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందగలవని అంచనా వేస్తే, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలంటే మొత్తం వ్యయం రూ.30,000 కోట్లకు చేరుతుంది. ఈ స్థాయి పథకం అమలు చేయాలంటే ప్రతి సంవత్సరం కనీసం రూ.10,000 కోట్లను కేటాయిస్తూ మూడు దశల్లో అమలు చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఇప్పటి వరకు ఈ పథకానికి సంబంధించిన స్పష్టమైన బడ్జెట్ కేటాయింపులు, అమలు షెడ్యూల్ కనిపించకపోవడం గిరిజనుల్లో అనుమానాలను పెంచుతోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ "అంబేద్కర్ అభయహస్తం" పేరిట ప్రతి గిరిజన కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీ మరింత పెద్ద ఆర్థిక బాధ్యతను సూచిస్తుంది. రాష్ట్రంలో కనీసం 1 లక్ష గిరిజన కుటుంబాలను తీసుకున్నా, ఈ పథకం కోసం రూ.12,000 కోట్లు అవసరం అవుతాయి. ఈ రెండు పథకాలను కలిపి చూస్తే, మొత్తం భారం రూ.42,000 కోట్లకు చేరుతుంది. తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ సుమారు రూ.3 లక్షల కోట్ల పరిధిలో ఉండగా, ఇందులో ఇంత పెద్ద మొత్తాన్ని కేటాయించడం సాధ్యమే కానీ దానికి స్పష్టమైన ప్రణాళిక అవసరం. ఇప్పటివరకు ఆ ప్రణాళిక కనిపించకపోవడం ప్రధాన విమర్శగా మారింది. గిరిజన సంక్షేమానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు మరో ముఖ్య అంశం.

గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో గిరిజన సంక్షేమానికి సుమారు రూ.30,000 కోట్ల వరకు కేటాయింపులు జరిగినట్లు అధికారికంగా ప్రకటించినప్పటికీ, వాస్తవ ఖర్చు మాత్రం దాదాపు 50% లోపే ఉన్నదని వివిధ నివేదికలు సూచిస్తున్నాయి. అంటే రూ.30,000 కోట్లలో కనీసం రూ.15,000 కోట్లు ఖర్చు కాకుండా మిగిలిపోయినట్టే. ఈ నిధులు పూర్తిగా వినియోగించబడితే గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి, విద్యా రంగంలో మార్పులు సాధ్యమయ్యేవి. కానీ ఖర్చు లోపం వల్ల ఈ మార్పులు జరగడం లేదు.

"సమ్మక్క-సారక్క గ్రామీణ అభివృద్ధి పథకం" కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో 5,727 గిరిజన గ్రామ పంచాయతీలు ఉన్నాయని తీసుకుంటే, ఒక్కో పంచాయతీకి ఏటా రూ.25 లక్షలు కేటాయిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం మొత్తం వ్యయం రూ.1,431.75 కోట్లకు చేరుతుంది. ఐదేళ్లలో ఇది రూ.7,158 కోట్ల భారీ ప్రణాళికగా మారుతుంది. ఈ స్థాయి ప్రణాళిక అమలు అయితే గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి ప్రాథమిక సదుపాయాల్లో గణనీయమైన మార్పు కనిపించాలి. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తే ఈ మార్పు ఇంకా దూరంలోనే ఉంది.

విద్యా రంగంలో "విద్యా జ్యోతి" పథకం కింద గిరిజన విద్యార్థులకు భారీ ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. పదో తరగతి నుంచి పీజీ స్థాయి వరకు ప్రతి విద్యార్థికి సంవత్సరానికి కనీసం రూ.50,000 నుంచి రూ.1,00,000 వరకు సహాయం అందిస్తామని చెప్పడం జరిగింది. రాష్ట్రంలో కనీసం 3 లక్షల గిరిజన విద్యార్థులు ఉన్నారని తీసుకుంటే, ఈ పథకానికి ప్రతి సంవత్సరం రూ.2,000 కోట్ల నుంచి రూ.3,000 కోట్ల వరకు అవసరం అవుతుంది. కానీ ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యా రంగంలో పెట్టుబడి పెట్టకపోతే గిరిజన సమాజం భవిష్యత్తు అభివృద్ధి సాధ్యం కాదన్న విషయం స్పష్టంగా ఉన్నప్పటికీ, ఆ దిశగా చర్యలు నెమ్మదిగా సాగుతున్నాయి. పోడు భూముల సమస్య గిరిజనుల జీవనాధారానికి సంబంధించిన అత్యంత కీలక అంశం. సుమారు 7 లక్షల ఎకరాల పోడు భూములపై హక్కులు ఇవ్వాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒక్కో ఎకరానికి కనీస మార్కెట్ విలువ రూ.3 లక్షలు తీసుకున్నా, ఈ భూముల మొత్తం విలువ రూ.21,000 కోట్లకు చేరుతుంది. ఈ భూములపై హక్కులు ఇవ్వడం అంటే కేవలం ఆస్తి హక్కు మాత్రమే కాదు, అది గిరిజన కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించే ఒక ప్రధాన చర్య. కానీ ఈ సమస్య ఇంకా పరిష్కారం కాని స్థితిలోనే ఉంది.

గిరిజన అభివృద్ధికి మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రతి కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయిస్తామని చెప్పడం కూడా ఒక ముఖ్య హామీ. మొత్తం రూ.1,500 కోట్లతో ఈ కార్పొరేషన్లు ప్రారంభమవ్వాలి. అదనంగా కొత్త ఐటీడీఏలను ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలనను దగ్గర చేయాలని లక్ష్యం. కానీ ఈ సంస్థల ఏర్పాటు, నిధుల కేటాయింపు, అమలు వంటి అంశాల్లో స్పష్టత లేకపోవడం గిరిజన వర్గాల్లో అసంతృప్తిని పెంచుతోంది.

ఈ మొత్తం పరిస్థితిని పరిశీలిస్తే ఒక స్పష్టమైన చిత్రం కనిపిస్తుంది,హామీలు భారీగా ఉన్నాయి, అంకెలు ఆకర్షణీయంగా ఉన్నాయి, కానీ అమలు మాత్రం కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక రాజకీయ వ్యూహంగా మాత్రమే మిగిలిపోతే, అది ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ముఖ్యంగా గిరిజనుల వంటి అణగారిన వర్గాలు మళ్లీ మళ్లీ మోసపోతున్నాయనే భావన పెరుగుతుంది.

ప్రభుత్వం ముందు ఉన్న సవాలు ఇప్పుడు స్పష్టంగా ఉంది. గిరిజన బంధు పథకానికి కనీసం మొదటి దశగా రూ.5,000 కోట్లతో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించాలి. అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని దశలవారీగా అమలు చేయడానికి ప్రతి సంవత్సరం రూ.3,000 కోట్ల చొప్పున ఐదేళ్ల ప్రణాళిక రూపొందించాలి. గిరిజన సంక్షేమానికి కేటాయించిన రూ.30,000 కోట్లలో కనీసం 90% నిధులను పూర్తిగా ఖర్చు చేయాలి. సమ్మక్క-సారక్క పథకానికి సంవత్సరానికి రూ.1,400 కోట్లను విడుదల చేయాలి. విద్యా జ్యోతి పథకానికి కనీసం రూ.2,500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి.


ఈ సంఖ్యలు కేవలం ఆర్థిక లెక్కలు మాత్రమే కాదు, ఇవి గిరిజన సమాజ భవిష్యత్తును నిర్ణయించే సూచికలు. ఈ లెక్కలు అమలులోకి వస్తేనే గిరిజనుల జీవితాల్లో నిజమైన మార్పు కనిపిస్తుంది.

ప్రజాస్వామ్యంలో విశ్వాసం నిలబెట్టుకోవాలంటే ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తప్పనిసరి. గిరిజనుల ఆశలు కేవలం ఎన్నికల సమయంలో వినిపించే నినాదాలుగా మిగిలిపోకుండా, పాలనలో ప్రతిఫలించాలి. లేకపోతే "వాగ్దానం" మరియు "అమలు" మధ్య ఉన్న అంతరం మరింత పెరిగి, అది రాజకీయంగా కూడా తీవ్రమైన ప్రతిఫలాలను తెచ్చే ప్రమాదం ఉంది.

ఈ నేపథ్యంలో గిరిజన సమాజం అడుగుతున్న ప్రశ్న చాలా సూటిగా ఉంది"మాకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుతాయి?" ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం కాంగ్రెస్ సర్కారు పైన ఉందనేది నగ్నసత్యం. లేనియెడల వచ్చే ఎన్నికలలో గిరిజనుల ప్రతాపం ఓటు ద్వారా ఉంటుందని పలు గిరిజన సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

## కేంద్రానికి అమరావతి తీర్మానం

**- ఏకగ్రీవ తీర్మానాన్ని పంపిన ప్రభుత్వం**



**అమరావతి,మార్చి 28( వెలుతురు):** రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి పంపించింది. కేంద్ర హోం శాఖ మంత్రి, రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీర్మానాన్ని పంపించారు. అలాగే కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఏపీ చీఫ్ సెక్రటరీకి తీర్మానం కాపీని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపారు. ఈ తీర్మానాన్ని మెయిల్ ద్వారా పంపడంతో పాటు, నేరుగా ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి ద్వారా ఢిల్లీకి పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాయంత్రానికి ఢిల్లీకి తీర్మానాన్ని పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడమే కాకుండా భవిష్యత్తులో ఎవరు వచ్చినా కూడా అమరావతిని మార్చే అవకాశం లేకుండా చేసే ఉద్దేశంతోనే 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని సవరిస్తూ ఏపీ శాసనసభ ఈరోజు ఏకగ్రీవ తీర్మానం చేసింది.

# ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ సబ్ ప్లాన్ కు చట్ట బద్ధత కల్పించాలి

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 28:**
కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ఈ అసెంబ్లీ సమావేశాలలోనే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తు రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి సబ్ ప్లాన్ కు చట్టబద్ధత కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా తాము అధికారంలోకి రాగానే మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ చట్టం చేస్తామని,ప్రతి ఆర్థిక సంవత్సరంలో బీసీల సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయించి ఐదు సంవత్సరాలకు గాను లక్ష కోట్లు బీసీల అభివృద్ధికి ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారని కానీ అమలుకు మాత్రం నోచుకోవడం లేదన్నారు.బీసీ సంక్షేమానికి మొదటి సంవత్సరం 9,200 కోట్లు,రెండవ సంవత్సరం 11,405 కోట్లు,ప్రస్తుత బడ్జెట్లో 12,511 కోట్లు కేటాయించారు,60 శాతం జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్లో 3.8% మాత్రమే నిధులు కేటాయించి ఇందులో ఖర్చు చేసింది కేవలం ఒక్క శాతం లోపు మాత్రమే, బీసీ, ఎంబీసీ, సంచల జాతుల ఫెడరేషన్, బీసీ కులాల ఫెడరేషన్ లకు అడపదడపా నిధులు కేటాయించిన వాటిని ఖర్చు చేయకుండా బీసీ కులాల అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగడం లేదు బీసీ కులవృత్తుల ఆధునికరణ కోసం స్వయం ఉపాధి పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య సత్య ప్రకాష్ నాయుడు ధోనేటి శేఖర్ పజ్జూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ పూట పసిప్రాణం బలి.. కన్నవారి కడుపుకోత తీర్చిన సమ్మి గౌడ్ ఫౌండేషన్

**- డెంగ్యూ రక్కసి కాటుకు చిన్నారి కృప మృతి అంత్యక్రియలకు 5000/- ఆర్థిక సహాయం - సమ్మయ్య గౌడ్..**

**- ఒకే ఇంట్లో ముగ్గురు బిడ్డలకు సోకిన జ్వరం మందుల కోసం అప్పు పుట్టక ఆ తల్లిదండ్రుల ఆవేదన..**

**- అన్నదాన ప్రసాదాన్ని వదిలి పసిమొగ్గ పాడె మోయడానికి పరుగెత్తుకొచ్చిన సమ్మిగౌడ్ మానవత్వం**



**కేసముద్రం వెలుతురు మార్చి 28:**
హన్మంతరావు నగర్ కాలనీ – అమీనాపురం: ఊరంతా రామనామ స్మరణతో మార్మోగుతుంటే.. ఆ ఇంట్లో మాత్రం కన్నవారి రోదనలు మిన్నంటాయి. లోకమంతా సీతారాముల కల్యాణ వేడుకల్లో మునిగితేలుతుంటే.. విధి వంచించిన ఆ నిరుపేద ఇంట్లో మాత్రం పసిప్రాణం గాలిలో కలిసిపోయింది. కేసముద్రం మున్సిపాలిటీ అమనాపురం హనుమంత్ రావు కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రతి ఒక్కరి గుండెను పిండేస్తోంది. వడ్డెర కులానికి చెందిన రాజు, సునీత దంపతులది రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు. వారికున్న ముగ్గురు కూతుళ్లు సువర్ణ, కృప, లక్ష్మిలకు ఒకేసారి డెంగ్యూ సోకింది. చేతిలో చిల్లిగవ్వ లేక, మందు బిళ్లలు కొనేందుకు అప్పు పుట్టక ఆ బిడ్డల ప్రాణాలను కాపాడుకోవడానికి ఆ తల్లిదండ్రులు పడ్డ ఆవేదన వర్ణనాతీతం. విధి ఆడిన వింత నాటకంలో సరైన వైద్యం అందక రెండో కుమార్తె కృప కన్నుమూసింది. పండుగ పూట ఇంటి దీపం ఆరిపోవడంతో ఆ తల్లిదండ్రుల కడుపుకోత ఊరంతా కన్నీరు పెట్టించింది. బిడ్డ పోయిన దుఃఖం ఒకవైపు.. కనీసం కడసారి సంస్కారాలు చేసేందుకు కూడా చేతిలో పైసల్లేని దైన్యం మరోవైపు. ఆ పసిమొగ్గను మట్టిలో కలిపేందుకు కూడా ఆ కుటుంబ పరిస్థితిని శర్వాణి ద్వారా తెలుసుకున్న కాలనీ యువకులు Md. పాషా, సాంబశివరావు, సురేష్, నరేష్, పవన్, అనిల్, ఇమ్రాన్, గణేష్, హరీష్, హరిమహేష్ కంటతడి పెట్టారు. వెంటనే వారు సమాచారాన్ని సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మయ్య దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరామనవమి సందర్భంగా తాను ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని సైతం పక్కన పెట్టి, "ఆకలి తీర్చడం కంటే ఆపదలో ఉన్న ప్రాణానికి తోడుండటం ముఖ్యం" అంటూ ఆయన వెంటనే అక్కడికి చేరుకున్నారు. తన సొంత ఖర్చులతో ఆ చిన్నారి అంత్యక్రియలు కోసం , కన్నీరు మున్నీరవుతున్న ఆ కుటుంబానికి రూ.5,000 తక్షణ సాయం అందించి పెద్ద దిక్కుగా నిలిచారు. పండుగ పూట పసిబిడ్డను పోగొట్టుకోవడమే కాకుండా అంతిమ సంస్కారాలు కూడా చెయ్యలేని దీన పరిస్థితి లో ఉన్న ఉన్న నిరుపేద కుటుంబానికి సమాచారం ఇచ్చిన అర గంటలో దేవుడిలా వచ్చి ఆదుకున్న సమ్మయ్య గౌడ్ ను చూసి హన్మశీతరావు నగర్ కాలనీ యువకులు,స్థానికులు "నిజమైన రాముడు అంటే ఇతనే" అని కొనియాడారు..



# కుషాయిగూడలో జాతీయ లోక్ అదాలత్

**- 81,078 కేసులకు పరిష్కారం రూ.34.54 లక్షల పరిహారం**





**కుషాయిగూడ, మార్చి 28 వెలుతురు :**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూ ఢిల్లీ మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివాదాలను సత్వరంగా, పరస్పర రాజీతో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి. బాల భాస్కర్ రావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ మాట్లాడుతూ, సాధారణ కోర్టు వ్యవస్థలో ఎక్కువ కాలం పట్టే కేసులను లోక్ అదాలత్ ద్వారా తక్కువ సమయంలోనే పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలను సౌహార్ద వాతావరణంలో ముగించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 ప్రత్యేక బెంచ్‌లలో మొత్తం 81,078 కేసులు పరిష్కారం పొందినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 39 సివిల్ కేసులు, 81,007 క్రిమినల్ కేసులు ఉండగా, అదనంగా బ్యాంకులు మరియు బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన 32 ప్రీ-లిటిగేషన్ కేసులు కూడా పరిష్కరించబడ్డాయి. ఈ లోక్ అదాలత్ ద్వారా మొత్తం రూ.34,54,988 మొత్తాన్ని పరిహారంగా చెల్లించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి. తిరుపతి, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్తయ్య, న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంకులు మరియు బిఎస్ఎన్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఉప్పరపల్లి గ్రామంలో ఘనంగా శ్రీ సీతారామచంద్రుల కళ్యాణం

***కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు భక్తులందరికీ నిర్వాహకులు ప్రత్యేక బొక్క బాల్ రెడ్డి కృతజ్ఞతలు***







**రాజేంద్రనగర్ వెలుతురు మార్చి 28:**
ఉప్పరపల్లి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగాశ్రీ సీతారామచంద్రుల కళ్యాణంఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో ఉప్పరపల్లి గ్రామస్థులు, వివిధ కాలనీల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ సీతారాముల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో, ఎంతో వైభవంగా నిర్వహించబడింది. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు భక్తులందరికీ నిర్వాహకులు ప్రత్యేక బొక్క బాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్ గారిని సత్కరించిన క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు



**శంకర్పల్లి వెలుతురు మార్చి 28 :**
శంకర్పల్లి మున్సిపాలిటీ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, కమిషనర్ యోగేష్ కుమార్, ఒకటవ వార్డ్ కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు, పదవ వార్డ్ కౌన్సిలర్ రాజండ్ల వసంత మహేందర్ రెడ్డి సంయుక్తంగా కలసి గత కొంతకాలంగా క్రిస్టల్ టౌన్షిప్ కాలనీలో నెలకొని ఉన్న ప్రధాన సమస్యలైనా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ, సిసి రోడ్ల నిర్మాణం, విధి దీపాల ఏర్పాటు మొదలగు సమస్యల గురించి చర్చించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది. దానికి వారు స్పందించి ఇంజనీర్ ని పిలిచి క్రిస్టల్ టౌన్షిప్ సమస్యలకుపై నివేదికను రూపొందించాలని తెలిపారు. వారు సిసి రోడ్డు నిర్మాణం చేపడుదాం అని తెలుపగా, కాలనీలో ప్రధానంగా సెంట్రలైజ్డ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాత సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులం కోరారు. వారు దానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం నూతనంగా చైర్మన్ పదవిని చేపట్టిన మున్సిపాలిటీ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, మున్సిపాలిటీ కమిషనర్ యోగిష్ కుమార్,మరియు వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు, రాజండ్ల వసంత మహేందర్ రెడ్డిని సత్కరించి అభినందనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, మరియు క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు ఎం విఠలయ్య, మరియు కొలాన్ గోవింద్ రెడ్డి, అధ్యక్షులు కొలాన్ ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్పల్లి అశోక్, సంయుక్త కార్యదర్శి కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, కాలనీవాసులు రవికుమార్, రాఘవేందర్ రెడ్డి, రామచంద్రయ్య, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రతపై దృష్టి సారించండి

**- డిప్యూటీ కమిషనర్లు.**



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 28.**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 23వ రోజు సందర్భంగా సైబరాబద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16 సర్కిళ్లలో కలిసి పటాన్ చేరు నుండి మణికొండ వరకు 22 KMs ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. ఈకార్యక్రమంలో ఫూట్ పాత్ అక్రమణలను తొలిగించడం, రోడ్ పైన మట్టి, చెత్త తొలిగించడం రోడ్లు శుభ్రం చేయడం మరియు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈ చర్యల ద్వారా రహదారులపై ట్రాఫిక్‌కు అడ్డంకులు తొలగించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గాజులరామారం సర్కిల్ శ్రీపాద రామేశ్వర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహాదేవ అనురాగ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (SWM రెడ్డి, స్వాతి AE, ఏసిపి సుమిత్ర, సెక్షన్ ఆఫీసర్ మచ్చుందర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ యుసిడి కమ్యూనిటీ ఆర్గనైజర్లు, UBD, శానిటేషన్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


# పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం





**శంకర్పల్లి, వెలుతురు మార్చి 28 :**
మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో చాలా లోపాలు వెలుగుచూస్తున్నాయి. చేవెళ్ల వెళ్లే ప్రధాన రోడ్డులో కుప్పలుగా పేరుకుపోయిన చెతత్తో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు అలాగే పలు కాలనీలల్లో సకాలంలో చెత్త తొలిగించకపోవడంతో చెత్త కుప్పలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ప్రత్యేకంగా నివాస ప్రాంతాల్లో చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా రాకపోవడం వలన ప్రజలు చెత్త ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. దీంతో చెత్త కుప్పల ద్వారా దుర్వాసన, దోమల పెరుగుదల, తద్వారా వ్యాదులు ప్యాప్తి చెందుతున్నాయని ప్రజలు భయపడుతున్నారు. పారిశుద్ధయపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోవడం లేదని, ప్రతి రోజూ చెత్త మధ్యనే జీవించాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పద్నాల్గవ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ పాడై మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వర్షాకాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ సమస్య మరింత ఎక్కవయ్యే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**శంకర్పల్లి, వెలుతురు మార్చి 28:**
పశువుల ఆరోగ్యం రైతుల ఆర్థిక స్థితిగతులకు మూలాధారం అని పిల్లిగుండ్ల గ్రామ సర్పంచ్ స్వాతికాంతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో మహరాజ్పేట్ పశు వైద్యాధికారిణి శ్రావణి ఆధ్వర్యంలో గానికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వ్యాపిస్తే రైతులకు భారీ నష్టాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. కావున ప్రతి రైతు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. పశువైద్యాధికారిణి శ్రావణి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి అత్యంత వేగంగా వ్యాపించే అంటువ్యాధి కావడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత కీలకమని తెలిపారు ప్రభుత్వం నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతులకు పశువుల సంరక్షణ, పోషణ, శుభ్రత మరియు వ్యాధి నివారణ చర్యలపై అవగామన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు హారికకిరణ్, స్వప్నరాఘవేందర్, అనూషమహేంద్రరెడ్డి, మెగులయ్య, సుమలతబండిరెడ్డి, కావలి రాజేందర్, మధు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచలేరు

**- ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు**



**శంకర్పల్లి, వెలుతురు మార్చి 28 :**
ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) శంకర్పల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, భవాని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు అన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి మహిళలు అని కూడా చూడకుండా వారి ఇళ్లకు వెళ్లి అరెస్టులు చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం సరైంది కాదని, సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆశా కార్యకర్తలకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం, పర్మనెంట్ ఉద్యోగాలు వంటి హామీలు ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పైగా పని భారం పెంచి ఆశా కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి వైఖరి కొనసాగితే రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ముందస్తు అరెస్టులకు గురైన వారిలో శంకర్పల్లి మండల కోశాధికారి స్వప్నతో పాటు ఆశా కార్యకర్తలు అమూల్య, యాదమ్మ, జ్యోతి, ప్రమీల, లావణ్య, కృష్ణవేణి, అమృత, అశ్వితతదితరులు ఉన్నారు.

# జర్నలిస్ట్ కాలనీలో ఘనంగా శ్రీ సీతారామ కల్యాణ వేడుకలు



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 28:**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ జర్నలిస్ట్ కాలనీ శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు, కళ్యాణ మహోత్సవానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి,కొలను రాజశేఖర్ రెడ్డి, సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు దేవాలయ ప్రాంగణంలో జర్నలిస్ట్ కాలనీ ఫౌండర్ మారుతి సాగర్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు, ఉత్సవ కమిటి అధ్యక్షులు గోవిందరావు,వనిత దంపతులు,కాలనీ ఉపాధ్యక్షుడు ముక్క దేవేందర్ గుప్తా అనురాధ, మల్లికార్జున్,సువర్ణ దంపతులు స్వామివారి కళ్యాణం పూజలు నిర్వహించారు. దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణరావు , భవ్య టీవీ ఎండీ కే వి వి సత్యనారాయణ, రమేష్, మహేష్, లక్ష్మన్ , రాముయాదవ్,బంటి మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు. భక్తులు అన్నదానానికి, వస్తు మరియు ధన రూపేనా అందించిన వారిలో నిజాంపేట్ మున్సిపల్ మాజీ కార్పొరేటర్ మీనా సునీల్ రెడ్డి, ఆస్కాని మారుతి సాగర్, కూనభరత్ గౌడ్, టేకుల సుధాకర్ రెడ్డి, ముక్కర్ల లాలయ్య, కొలను జనార్దన్ రెడ్డి, తలారి వీరేష్ ముదిరాజ్, రవికుమార్. దాల్ నాయుడు, మిత్రా, సురేష్, జీవన్ రోషన్, కొండ వెంకటేష్, తమ వంతు సహాయ సహకారాలు అందజేసి స్వామివారి పూజలో పాల్గొన్నారు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు, కాలనీ వాసులుతో పాటు చుట్టుపక్కల ప్రజలు పాల్గొన్నారు.

## వేలం పాటలో కబేళ దక్కించుకున్న కొత్తూరు నవీన్



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 28:** నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 20262027 సంవత్సరానికి సంబంధించిన పశువుల సంత, తైబజారు మరియు కాబేలా నిర్వహణ హక్కుల బహిరంగ వేలం శనివారం (28-03-2026) నాడు ఇూూ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ప్రభుత్వం వేలం పాట లక్ష్యాలు చేరుకోకపోవడంతో, ప్రతి శుక్రవారం నిర్వహించే పశువుల సంత & తైబజారు వేలం పాటను 31-03-2026 తేదీకి వాయిదా వేశారు. ఇక కాబేలా వేలం మాత్రం అదే రోజు నిర్వహించగా పందుల రాకేష్ జిల్లా చిన్నా, ఈ వేలంలో పోటీ పడగా ఫైనల్ గా నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన కొత్తూరు నవీన్ రూ.33,000కు కాబేలా నిర్వహణ హక్కులను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇూూ , ఎంపీడీవో నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ , ఉప సర్పంచ్ సామ శిరీష ప్రవీణ్ రెడ్డి , పంచాయతీ కార్యదర్శి రవి కుమార్ వార్డు సభ్యులు బకారం జనార్దన్, జిల్లా మహేష్ అమానగంటి ఐలయ్య పర్రేపాటి సైదులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి సందర్భంగా అన్నదానం నిర్వహించిన బాకరం జనార్దన్



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 28:** నార్కట్‌పల్లి పట్టణంలోని శ్రీ రామ్ నగర్ కాలనీలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా 6వ వార్డు సభ్యుడు బకారం జనార్దన్ వారి సతీమణి వినోద తో కలిసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నార్కట్‌పల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ హాజరై ఆశీర్వాదాలు పొందారు. అలాగే ఈ వేడుకలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, కాలనీవాసులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి

**గుండాల మార్చి28 (వెలుతురు):**



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎలక్షన్లో నూతనంగా గెలిచిన వార్డు సభ్యులకు ఎంపీడీవో కార్యాలయంలో ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకొని శనివారం ఎంపీడీవో చండీరాణి మండల పంచాయతీ అధికారి సలీంతో గ్రూప్ ఫోటో దిగి వార్డు సభ్యులకు శిక్షణ పూర్తి చేసుకున్న ధృవీకరణ పత్రాలు వార్డు సభ్యులకు అందజేశారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధికి సహకరించాలని గ్రామంలో వీధిలైట్లు త్రాగునీరు పచ్చదనం పరిశుభ్రత రోడ్లు మురికి కాలువలు సర్పంచు వార్డు సభ్యులు కార్యదర్శి ఒకే మాటపై ఉండి పనులు చేయించాలని అన్నారు. గ్రామానికి అనుసంధానమైన శాఖలు అంగన్వాడి మహిళా సంఘాలు ప్రాథమిక విద్య గ్రంథాలయం గుళ్ళు గోపురాలు నర్సరీ చౌక ధర దుకాణాలు వివిధ రకాల శాఖలు గ్రామపంచాయతీ పంచాయతీ రాజ్ చట్టానికి అనుగుణంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వార్డు సభ్యులు ఉపసర్పంచులు శిక్షణ అధికారులు పాల్గొన్నారుం.

## యువకుడి మరణంతో మాసాన్ పల్లి గ్రామంలో విషాదం



**గుండాల మార్చి 28(వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మాసాన్ పల్లి గ్రామానికి చెందిన బత్తిని మహేష్ గౌడ్ 24 సంవత్సరాలు గత నాలుగు రోజుల క్రితం బైక్ ప్రమాదంలో బ్రెయిన్ కు బలంగా దెబ్బలు తగలడంతో మహేష్ గౌడ్ ను మలక్పేట్ యశోద హాస్పిటల్లో చేర్పించినప్పటికీ నాలుగు రోజుల తర్వాత చికిత్స అందించినా కూడా బలమైన దెబ్బలు తగలడంతో డాక్టర్లు బ్రెయిన్ డెడ్ అయినట్లుగా గుర్తించారు. ఒక జీవన్ దాన్ సంస్థ వారి తల్లిదండ్రులైన బత్తిని ఎల్లయ్య, మహేశ్వరి కి అవయవ దానం గురించి అవగాహన కల్పించారు. అవయవ దానానికి అంగీకరించిన తల్లిదండ్రులు 8 మందికి అవయవాలను దానం చేసినట్లుగా వారు తెలిపారు. ఈ బత్తిని మహేష్ గౌడ్ ఉప్పల్ లో నివాసం ఉంటూ ఒక ప్రైవేటు మెట్రో షాపింగ్ మాల్ లో పనిచేస్తున్నట్లుగా తల్లిదండ్రులు తెలిపారు. వారికి ఒకే ఒక్క కుమారుడు కావడంతో తల్లిదండ్రులు గ్రామస్తులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

## వీధి కుక్కల దాడిలో కంటిచూపు కోల్పోయిన బాలుడికి అండగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ మార్చి, 28 (వెలుతురు న్యూస్ ):** భువనగిరి పట్టణంలో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి, దురదృష్టవశాత్తూ కంటిచూపును కోల్పోయిన చిన్నారి ప్రియాంష్ పరిస్థితిపై భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన బాలుడిని ఎంపీ స్వయంగా పరామర్శించారు. కంటికి సంబంధించిన ప్రాథమిక చికిత్స పూర్తయిన నేపథ్యంలో, ఎంపీ ఎల్.వి. ప్రసాద్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాలుడి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఆయన తక్షణమే స్పందిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గారితో మరియు బీబీనగర్ ఎయిమ్స్ (AIIMS) ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా చర్చించారు. చిన్నారి ప్రియాంష్‌కు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది కలగకుండా, బీబీనగర్ ఎయిమ్స్ ద్వారా సాధ్యమైనంత మెరుగైన మరియు అత్యాధునిక వైద్య చికిత్స అందేలా చూడాలని కలెక్టర్ గారిని మరియు ఎయిమ్స్ అధికారులను ఎంపీ కోరారు. ఆదుకోవాల్సిన వయసులో ఇలాంటి ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని, బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున పూర్తి అండగా ఉంటామని చామల కిరణ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## బైకాని నరసింహా మృతి చాలా బాధాకరం

**- కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ సర్పంచ్ పల్లివాడ**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 28:** పల్లివాడ గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో సిపిఎం పార్టీ నాయకులు బైకానీ నరసింహా మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నరసింహా సిపిఎం పార్టీకి చేసిన సేవలను గుర్తుకు చేసినారు. అనంతరం నరసింహా కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సహకారంతో 37 వేల రూపాయల ఆర్థిక సహాయం నరసింహా కుటుంబ సభ్యులకు అందజేసినారు. భవిష్యత్తులో కూడా నరసింహా కుటుంబానికి అండగా ఉంటామని తెలిపినారు. ఏది ఏమైనా ఒక మంచి సిపిఎం పార్టీ నాయకుని కోల్పోవడం చాలా బాధాకరమని పార్టీకి నిబద్ధతతో పనిచేసే మంచి మనిషి అని వారు ఎక్కడున్నా వారి ఆత్మ శాంతించాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు గౌడ్, నాంపల్లి లింగయ్య మాజీ ఉపసర్పంచ్ దండిగ నాగరాజు, కంకణాల శేఖర్ రెడ్డి, గడ్డం యాదగిరి, నాంపల్లి నరసింహా, బెజ్జంకి శంకరాచారి, మేకల లింగయ్య, కల్లూరి శ్రీనివాస్, తోటకూరి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీగా... బిఆర్ఎస్ పట్టణ అధ్యక్ష పదవి ...

# గొంగిడి మనసులో ఉన్నది ఎవరు ..!?

- సుదీర్ఘకాలంగా యాదగిరిగుట్ట బిఆర్ఎస్ పట్టణ అధ్యక్ష పదవి ఖాళీ...!!
- నేటికీ పట్టణ అధ్యక్షున్ని నియమించకపోవడానికి కారణమేంటంటూ... రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చలు..!?
- పట్టణ అధ్యక్ష పదవి భర్తీ ప్రక్రియను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వెళ్తున్న ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి
- త్వరలో పట్టణ కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించెనా ? ... అంటూ నాయకులు, కార్యకర్తల్లో చర్చ ...
- పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి ని ఊరిస్తున్న ....అధ్యక్ష పదవి ??
- పట్టణ అధ్యక్ష పదవికి గుండ్లపల్లి గ్రామం నుంచి పోటీపడుతున్న ఇద్దరు యువ నేతలు ?
- కాంగ్రెస్, బిజెపి పార్టీలను గట్టిగా ఎదుర్కొనేలా బలమైన నాయకుడికి యాదగిరిగుట్ట బిఆర్ఎస్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలనే యోచనలో గొంగిడి మహేందర్ రెడ్డి ..!!



**యాదగిరిగుట్ట , మార్చి 28 ( వెలుతురు )** నియోజకవర్గంలో అత్యంత కీలకమైన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్ష పదవి సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉంది. ఈ పదవిని త్వరలోనే భర్తీ చేస్తామంటూ చెబుతూ వస్తున్న ఆ పార్టీ పెద్దలు భర్తీ ప్రక్రియను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో యాదగిరిగుట్ట పట్టణ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలలో కొంత గందరగోల పరిస్థితి నెలఉంది. త్వరలో బిఆర్ఎస్ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పట్టణ కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా అధ్యక్ష పదవితో పాటు మొత్తం కార్య వర్గాన్ని నూతనంగా ఏర్పాటు చేస్తున్నామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నప్పటికీ సుదీర్ఘకాలంగా వాయిదా వేయడం లోని ఆంతర్యం ఏమిటంటూ ? ....అటు పార్టీలో ...ఇటు పొలిటికల్ సర్కిల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది . గతంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాయకుడు పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఆయన వెళ్లిపోయిన వెంటనే అధ్యక్ష పదవిని భర్తీ చేయాల్సి ఉండగా అప్పటినుండి బిఆర్ఎస్ పట్టణ అధ్యక్ష పదవి ని ఖాళీగా ఉంచుతూ వస్తున్నారు. కాగా ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేసి ఓటమి చెందిన పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి పార్టీ పట్టణ అధ్యక్ష పదవిపై గత కొంతకాలం ఆశలు పెట్టుకున్నారు. ఆయనను పార్టీ అధ్యక్ష పదవి గత కొంతకాలంగా.... ఊరిస్తోంది. పట్టణ అధ్యక్ష పదవి పాపట్ల నరహరితో దోబూచులాడుతోంది.... గతంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్ష పదవి నిర్వహించిన నేత పార్టీ నుంచి వెళ్లిపోవడంతో అప్పటి నుండి పట్టణ సెక్రటరీ జనరల్ గా ఉన్న పాపట్ల నరహరి ఆధ్వర్యంలోనే పట్టణ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ నేటికీ పట్టణ అధ్యక్ష పదవిని భర్తీ చేయడం లేదు. దీని వెనుక ఏదైనా బలమైన కారణం ఉందా ? ... అనే చర్చ విస్తృతంగా సాగుతోంది. మున్సిపల్ ఎన్నికలకు ముందే పట్టణ అధ్యక్ష పదవిని భర్తీ చేస్తారని స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆశించినప్పటికీ అలా జరగలేదు. మున్సిపల్ ఎన్నికల్లో యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ కేవలం ఒకే ఒక్క సీటు గెలుచుకోవడంతో పట్టణ పార్టీలో తీవ్ర నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా మాజీ ఎమ్మెల్యే, ఆలేరు నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్చార్జి గొంగిడి సునీత రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిలు యాదగిరిగుట్టలో పార్టీ పరాజయం పాలు కావడంపై గల కారణాలను లోతుగా అన్వేషిస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పలుమార్లు విడివిడిగా వార్డుల వారిగా సమావేశమై ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పరాజయం పొందిన నేపథ్యంలో పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేసి, దూకుడుగా వెళ్లేందుకు బలమైన నాయకుడి కి అధ్యక్ష పదవి అప్పగించాలని గొంగిడి మహేందర్ రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపున కాంగ్రెస్, బిజెపి పార్టీలు యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో నువ్వా ? నేనా ?... అన్నట్లుగా దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ తన ఉనికిని మరింత గట్టిగా చాటుకునేందుకు అన్ని రకాల శక్తులను కూడదీసుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్, బిజెపి పట్టణ అధ్యక్ష బాధ్యతలలో ఉన్న నాయకులకు దీటుగా దూకుడుగా పోరాట పటిమ కలిగిన నాయకుడికి బిఆర్ఎస్ అధ్యక్ష పదవి అప్పగించాలని గొంగిడి మహేందర్ రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే గత కొంతకాలంగా పట్టణ అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్న పట్టణ పార్టీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి ఆశలు నెరవేరేనా ?.... అని మరో వైపు చర్చ జరుగుతోంది . యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపల్లి ప్రాంతం నుండి ఇద్దరు యువ నాయకులు అధ్యక్ష పదవి కోసం గట్టిగా పోటీ పడుతున్నట్లు సమాచారం . గతంలో పార్టీ అధ్యక్షుడుగా ఉన్న నేత పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత పూర్తిస్థాయిలో పట్టణ పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూ ఆందోళనలు ఉద్యమాలు ధర్నాలు చేస్తూ పార్టీ కోసం పనిచేసిన తనకే అధ్యక్ష పదవి దక్కుతుందనే ధీమాలో పాపట్ల నరహరి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన ఇప్పటికే గొంగిడి దంపతులకు తన కోరికను తెలియజేసినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లో తనకే అధ్యక్ష పదవి కట్టబెట్టాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది. కాగా గుండ్లపల్లి యాదగిరిగుట్ట టౌన్ ప్రాంతం నుంచి కొందరు నాయకులు ఈ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అత్యంత కీలకమైన యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పట్టణ అధ్యక్ష పదవిని ఎట్టకేలకు త్వరలో భర్తీ చేసి రానున్న కాలంలో పార్టీని పట్టణంలో మరింత బలోపేతం చేయాలని పార్టీ పెద్దలు కృత నిశ్చయంతో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు గొంగిడి మహేందర్ రెడ్డి ఇప్పటికే బలమైన కసరత్తును చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఒక వైపున కాంగ్రెస్ , బిజెపిలు యాదగిరిగుట్ట పట్టణంలో రాజకీయంగా దూసుకుపోతుండగా ప్రధాన ప్రతిపక్షంగా గతంలో ప్రభుత్వంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీకి అధ్యక్ష పదవిలో ఎవరు లేకపోవడం అనేది రాజకీయంగా పెద్ద లోటు అనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది . ఎక్కువ కాలం ఈ పదవిని ఖాళీగా ఉంచకుండా వెంటనే భర్తీ చేస్తే నే పార్టీకి తగిన బలం చేకూరుతుందని లేకపోతే ప్రజల్లో నెగటివ్ అభిప్రాయం వెళ్లే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పదవ వార్డు బిఆర్ఎస్ పార్టీ చేజారి, కాంగ్రెస్ ఏకగ్రీవం చేసుకోవడం, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఒకే ఒక స్థానానికి బిఆర్ఎస్ పరిమితం కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలలో గత కొంతకాలంగా తీవ్రమైన నిరాశ ఉంది. ఇప్పటికైనా బలమైన చురుకైన నాయకుడికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించి పార్టీని శరవేగంగా ముందుకు తీసుకెళ్లేలా కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని పలువురు తమ నాయకుడు గొంగిడి మహేందర్ రెడ్డి కి కూడా తెలియజేసినట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ త్వరలో బిఆర్ఎస్ యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్ష పదవిని భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది అయితే ఆ పదవి పై మొదటి నుండి ఆశలు పెట్టుకున్న పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి కి దక్కుతుందా ?... లేక గొంగిడి మహేందర్ రెడ్డి మనసులో అధ్యక్ష పదవికి ఇంకెవరైనా ఉన్నారా ?... అనే అంశం తీవ్రమైన ఉత్కంఠతను , ఆసక్తిని రేకెత్తిస్తోంది... దీనిపై మరికొన్ని రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలలో పట్టణ నూతన కార్యవర్గం, పట్టణ అధ్యక్ష పదవి విషయంలో ఏం జరుగుతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు



**పుట్ట హనుమంత్**
**( సీనియర్ జర్నలిస్ట్ )**

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

**- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే సోములు**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 28:** మార్చి 30 న భవన నిర్మాణ కార్మిక సమస్యలపై లేబర్ కమిషనర్ ముందు జరిగే మహాధర్నాల జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే సోములు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో కరపత్రం ఆవిష్కరించి మాట్లాడుతూ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీం లను ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెట్టవద్దని, అవినీతిమయంగా మారిన సి.ఎస్.సి హెల్త్ తెస్తులను రద్దు చేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు సాదారణంగా మరణిస్తే ఐదు లక్షలు, ప్రసూతి వివాహ కానుక లక్ష రూపాయలకు పెంచాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డులో పెండింగ్ లో ఉన్న క్లైమూలను పూర్తి చేయాలని, సంక్షేమ బోర్డులో నిధుల దుర్వినియోగం పై సమగ్ర విచారణ జరపాలని. 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్ పిల్లలకు ఉపకారవేతనాలు చదువులకు ఆర్థిక సహకారం అందించాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ముప్పయిన లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే మహా ధర్నాకు జిల్లావ్యాప్తంగా భావన నిర్మాణ కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంగాలమారయ్య,గాదెకృష్ణ,నాయకులు బుడ్డా ప్రసాద్,రసాల రమేష్,జుంపాల మహేష్, గొరిగే మల్లేష్, తరిగొప్పుల వెంకటరెడ్డి, కొల్లూరి నాగరాజు, సైదులు, దుర్గారావు,తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఏకో బజార్ కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 28:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత ప్రభుత్వ అటవీ, పర్యావరణ మరియు వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ జాతీయ హరిత దళం సహకారంతో నిర్వహిస్తున్న పర్యావరణ విద్య కార్యక్రమంలో భాగంగా, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఎకో బజార్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని , ఇలాంటి కార్యక్రమాలవల్ల విద్యార్థులు ఉపాధి పొందడానికి కూడా అవకాశం ఉంటుందని అన్నారు. క్యాంపస్ ఎకో బజార్ కన్వీనర్, మరియు అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్న బాబు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించనటువంటి పదార్థాలను ఉపయోగించడం ద్వారా ప్రకృతి పరిరక్షణే కాకుండా మనుషులు కూడా ఆరోగ్యంగా జీవించగలరని అన్నారు. విద్యార్థులు స్వయంగా మట్టితో తయారుచేసిన బొమ్మలు, చిరుధాన్యాలతో, పండ్లు కూరగాయలతో చేసిన ఆహార పదార్థాలు, కాగితంతో తయారుచేసిన వివిధ కళాకృతులను ప్రదర్శించారు. అనంతరం ఇందులో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రధానాచార్యులు ప్రశంసాపత్రములను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, అధ్యాపకులు డాక్టర్ జి. సునీత, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, టి.శ్రీనివాస్, ఆంజనేయులు, నరేష్, రాధికతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా 546 కేసులు పరిష్కారం

**- కక్షిదారులకి కుదిరిన ఒప్పందం**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 28:** రామన్నపేట కోర్టు పరిధిలో మొత్తం 546 కేసులకు పరిష్కారం లభించింది. శనివారం నాడు రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జ్ జి.సబిత, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి. సత్తయ్య లు కలిసి కోర్టు హల్ లో జాతీయ లోక్ అధాలత్ ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగుడూరు స్టేషన్ పరిధిలో సివిల్, క్రిమినల్, బ్యాంకు, ప్రీ లిటిగేషన్, ఇతర ప్రీ లిటిగేషన్, పిట్టి కేసులు పరిష్కరించుకున్నారు. బ్యాంక్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసుల ద్వారా 5,18,350/- రూపాయలు అమౌంట్ రికవరీ చేయబడినట్లు తెలిపారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ క్షణిక ఆవేశాలతో అప్పటి పరిస్థితులలో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజమార్గమే యాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్ ఆధాలత్ వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు, పలు మండలాల ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్లు, వివిధ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

**సంగారెడ్డి,మార్చి28( వెలుతురు):** సంగారెడ్డి జిల్లా కంది మండలం జులకల్‌లో శనివారం దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి.. తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతులను మమత (28), కుమారుడు మణికంఠ (5), కుమార్తె ప్రళయ (4) గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది జనవరిలో రోడ్డు ప్రమాదంలో మమత భర్త మృతి చెందాడు. భర్త చనిపోయడాని మనస్తాపానికి గురైన మమత పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జులకల్ చేరుకొని వివారాలు సేకరిస్తున్నారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్








**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 28**

శనివారం కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష వ్రాస్తున్న విద్యార్థుల హాజరు శాతం, సౌకర్యాల పై విద్యా శాఖ అధికారి రాజు ను అడిగి తెలుసుకొని, పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య , భద్రత దృష్ట్యా వైద్య సిబ్బంది, అవసరమైన మెడిషన్ ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కలెక్టర్ వెంట డి ఈ ఓ రాజు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుడ్డును తూకం వేసి బరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 28**

కామారెడ్డి జిల్లా మద్నూర్ లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్‌లోని స్టోర్ రూమ్‌ను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ముఖ్యంగా గుడ్ల పరిమాణం, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, స్వయంగా గుడ్లను తూకం వేసి వాటి బరువును పరిశీలించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా గుడ్ల బరువు ఉందో లేదో తనిఖీ చేస్తూ, తక్కువ బరువుతో సరఫరా అవుతున్నాయా అన్న అంశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తక్కువ బరువుతో గుడ్లు సరఫరా అయితే సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, సరఫరాలో నాణ్యత లోపాలు ఉంటే గుత్తేదారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న ఆహారం, వసతులపై ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, విద్యార్థులకు పోషకాహారం అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్కూల్ లో శుభ్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డి ఈ ఓ.రాజు, డి సి ఓ.రామ్మోహన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# యువత బంగారు జీవితాన్ని విద్య వైపు చూపాలి

**- డాక్టర్ పనకంటి. భాస్కరరావు**




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 28:**

మండల కేంద్రంలోని శ్రీ హిందూ డిగ్రీ కళాశాల నందు యాంటీ డ్రగ్స్ పై రామన్నపేట ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పనకంటి. భాస్కర్ రావు మాట్లాడుతూ విద్య చాలా గొప్పదని ఈ ప్రపంచాన్ని కేవలం విద్య ద్వారా మాత్రమే సాధించవచ్చు. అని యువత ప్రధానంగా నేడు పరిస్థితుల్లో విద్యకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని ధూమపానం మద్యపానానికి దూరంగా ఉండాలని నేడు క్షణికావేశంలో యువత తెలిసి తెలియని వయసులో డ్రగ్స్ కు అలవాటు పడి తమ యొక్క అమూల్యమైన జీవితాన్ని వారి తల్లిదండ్రుల యొక్క ఆశయాలకు విరుద్ధంగా ఎవరు కూడా వెళ్ళవద్దు. అని విద్యద్వారా ప్రపంచంలో దేనినైనా సాధించవచ్చు. అని విద్యార్థులను ఉద్దేశించి ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించడం జరిగింది. డ్రగ్స్ నిర్మూలించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటే దానివల్ల నష్టపోయే విషయాలను కులంకషంగా చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బండారు శ్రీదేవి ఎక్సైజ్ సీఐ ఆర్ బాలాజీ నాయక్, ఎస్సై బి శివకృష్ణ, అండ్ ఎన్ శంకర్, అనిల్ కృష్ణ, వెంకటేష్. సోని కళాశాల అధ్యాపకులు వెంకటరమణారెడ్డి,లింగస్వామి, కళ్యాణి, వెన్నెల, సునీల్ పాల్గొనడం జరిగింది.

# బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులకు సన్మానం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 28:**

నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి.మజీద్, ఉపాధ్యక్షులుగా బాలరాజు,జనరల్ సెక్రటరీ గా యాదాసు యాదయ్య ఎన్నికైనందున రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో షాలువాలతో సత్కరించి, పూలదండలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ,ఉప సర్పంచ్ మోటె రమేష్,గోదాసు పృథ్వీరాజ్,డీసీసీబీ డైరెక్టర్ జెల్ల వెంకటేశం,మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్,వనం చంద్రశేఖర్, వార్డు సభ్యులు అబ్దుల్ వాహిద్ మహమ్మద్,కొమ్ము శేఖర్,కొమ్మురామ స్వామి,సుదర్శన్,కందుల సాయి,గొరిగే శేఖర్,రామన్నపేట సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎండీ నిజాముద్దీన్,సీనియర్ నాయకులు ఎండీ నాసర్,మైనారిటీ నాయకులు ఎండీ తాహిర్,గొలుసుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహణ






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 28**

జాతీయ లోక్ అదాలత్ సమావేశం శనివారం నాడు కామారెడ్డి ప్రధాన జిల్లా న్యాయమూర్తి కోర్టు హాల్లో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. చి. వి. ఆర్. ఆర్. వరప్రసాద్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించేందుకు ఉత్తమ వేదికగా నిలుస్తాయని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో ఇవి అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.దఅదేవిధంగా, ఆయన లీగల్ సర్వీసెస్ అథారిటీస్ చట్టం, 1987 (1995లో అమల్లోకి వచ్చినది) ప్రాముఖ్యతను వివరించి, మహాత్మా గాంధీ సిద్ధాంతాల ఆధారంగా లోక్ అదాలత్ ఏర్పాటయ్యాయని తెలిపారు. న్యాయ వ్యవస్థపై ఉన్న భారం తగ్గించడంలో , సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంలో లోక్ అదాలత్ లు ముఖ్యమైన సాధనమని అన్నారు. ప్రధాన జిల్లా న్యాయమూర్తి & చైర్మన్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, కామారెడ్డి మార్గదర్శకత్వంలో శనివారం జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించబడింది. కామారెడ్డి, బాన్స్‌వాడ, బిచ్కుంద , ఎల్లారెడ్డి కేంద్రాలలో మొత్తం 8 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ వివాదాలు, రాజీ చేసుకునే క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, భూ వివాదాలు, ప్రామిసరీ నోట్ కేసులు, ఆస్తి వివాదాలు, కార్మిక సమస్యలు, ప్రీ-లిటిగేషన్ కేసులు విస్తృతంగా పరిష్కరించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, లోక్ అదాలత్ రెండు పక్షాలకు లాభదాయకమైన ("విన్-విన్") పరిష్కారం అందిస్తాయని, దీని ద్వారా సమయం, ధనం , మానసిక ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ బంధువులు, స్నేహితులకు కూడా లోక్ అదాలత్ విధానం గురించి అవగాహన కల్పించాలని కోరారు. అదనపు కలెక్టర్ వి.విక్టర్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో ప్రీ-సిట్టింగ్ చర్చలు , మధ్యవర్తిత్వం (మేడియేషన్) ద్వారా వివాదాలు పరిష్కరించబడుతున్నాయని, ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీమతి టి. నాగరాణి సభకు స్వాగతం పలికి, లోక్ అదాలత్ ల ద్వారా ప్రజలకు అందుతున్న ఉచిత న్యాయ సేవల ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు, ప్రభుత్వ శాఖలు అందించిన సహకారం కీలక పాత్ర పోషించింది. లోక్ అదాలత్‌లో రాజీకి వచ్చిన పక్షాలకు సెటిల్‌మెంట్ ఆర్డర్లు వెంటనే అందజేయబడినాయి. ఈ కార్యక్రమంలో డా. సుమలత (సీనియర్ సివిల్ జడ్జి), కె. సుధాకర్ (ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి), బి. దీక్ష (మొబైల్ మేజిస్ట్రేట్), చంద్రశేఖర్ (సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్), బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నందా రమేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజగోపాల్ గౌడ్, ఎ.పి.పి.ఓ. రాజిని, సభ్యులు సిద్ధా రాములు, శంకర్ రెడ్డి, శివరాత్రి ప్రతాప్, శ్రవణ్ గౌడ్, సలీమ్, శబానా బేగం, జగన్నాథం, శ్రీధర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంథ్య నాయక్, సూపరింటెండెంట్లు భుజంగరావు, వెంకట్ రెడ్డి, చంద్రసేన్ రెడ్డి, ఖాన్, శ్రవణ్, పరా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, కామారెడ్డి అన్ని వర్గాల ప్రజలు లోక్ అదాలత్ లను వినియోగించుకొని త్వరిత, తక్కువ ఖర్చుతో కూడిన, శాశ్వత, స్నేహపూర్వక న్యాయ పరిష్కారాన్ని పొందాలని ఆకాంక్షిస్తూ, ఈ కార్యక్రమం విజయవంతానికి తోడ్పడిన అన్ని భాగస్వాములకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

# ప్రజా ప్రతినిధులారా మీరు ఆదర్శంగా నిలవండి

- మీ ఇండ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోండి
- ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించండి
- కోటి ఇండ్లల్లో సోలార్ వ్యవస్థ ఏర్పాటే మోదీ సర్కార్ లక్ష్యం
- సోలార్ ప్యానెల్ పై సబ్సిడీతోపాటు 80 శాతం లోన్ వస్తుంది
- పేదలకు సైతం భారం లేకుండా సోలార్ ను ఏర్పాటు చేసుకునే వీలుంది
- విద్యుత్ కొనే స్థాయి నుండి అమ్మే స్థాయికి రావాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- కరీంనగర్ లోని తన నివాసంపై సోలార్ ప్యానల్ ను ఏర్పాటు చేసుకున్న కేంద్ర మంత్రి
- అధికారులతో కలిసి సోలార్ ప్యానెల్ ను పరిశీలించిన బండి సంజయ్










**కరీంనగర్ వెలుతురు మార్చి 28:**

రాష్ట్రంలోని వార్డు మెంబర్ మొదలు సర్పంచ్ దాకా, కౌన్సిలర్ మొదలు కార్పొరేటర్ దాకా ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి తమ తమ ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కోటి ఇండ్లపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యమన్నారు. అందుకోసం రూ.75 వేల కోట్లకుపైగా నిధులను కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ సోలార్ వ్యవస్థపై పూర్తిస్తాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన నివాసంపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకున్నారు. శనివారం రోజున ఉదయం టీజీరెడ్కో అధికారులు, డిస్ట్రిబ్యూటర్ తో కలిసి సోలార్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు రూపొందించిన 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఏమన్నారంటే....

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు నా ఇంటిపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. నిత్యం ఈ దేశాన్ని కాపాడాలి. దేశ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే మహానేత మోదీ. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం...ముఖ్యంగా చిట్ట చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందించాలనే అంత్యోదయ సిద్ధాంతంతో పనిచేస్తున్నారు. అందులో భాగంగానే దేశంలోని కోటి ఇండ్లపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యుత్ ను అందించాలనే లక్ష్యంతో "పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" పథకాన్ని 2024 ఫిబ్రవరి 15న ప్రవేశపెట్టినం. ఈ సోలార్ ప్యానల్ ద్వారా ఒక్కో ఇంటికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ ను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 75 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించినం.

తొలుత ప్రజాప్రతినిధులంతా తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని మోదీ పిలుపునిచ్చారు. కాబట్టి వార్డ్ మెంబర్ మొదలు సర్పంచ్ దాకా, కౌన్సిలర్ మొదలు కార్పొరేటర్ దాకా ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నా. సోలార్ వ్యవస్థపై అవగాహన కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమవుతోంది. ఎందుకంటే 2024లో ఈ పథకం ప్రవేశపెట్టినా ఇంతవరకు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సగటున 5 నుండి 7 వేల కుటుంబాలు సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకునేందుకు సరిపడా కేంద్రం నిధులు కేటాయించింది.

అందుకే ప్రజలందరినీ కోరుతున్నా... ఒక్కో ఇంటిపై సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకుంటే... అందుకయ్యే వ్యయంలో 30 వేల నుండి 78 వేల రూపాయల వరకు సబ్సిడీ అందిస్తోంది. నా ఇంటి విద్యుత్ బిల్లులు ప్రతినెలా 25 నుండి రూ.30 వేలు ఖర్చు వస్తోంది. ఈ సోలార్ ప్యానెల్ ఏర్పాటు ద్వారా ఇకపై బిల్లులు రూ.5 వేలలోపే వచ్చే అవకాశముంది. అందుకే ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవాలి.

విద్యుత్ ను కొనుగోలు చేసే స్థాయి నుండి అమ్మే స్థాయికి రావాలన్నది మోదీ ఆకాంక్ష. రైతులు, సామాన్య ప్రజలంతా ఈ సోలార్ వ్యవస్థను వాడుకుని కరెంట్ ను కొనే స్థాయి నుండి అమ్మే స్థాయికి రావాలని కోరుతున్నా. పేద ప్రజలకు కూడా భారం కాకుండా సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకుంటే... 80 శాతం వరకు లోన్ వస్తుంది. అది కూడా వాయిదాల పద్ధతిలో చెల్లించే అవకాశముంది. కాబట్టి ఏ మాత్రం భారం కాకుండా సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకోవచ్చు.

అట్లాగే వ్యవసాయంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించి ఆదాయాన్ని పెంచాలనే లక్ష్యంతో ౨వీ-ఖఖూఖవీ (ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్తాన్ మహాభియాన్) పథకాన్ని ప్రవేశపెట్టింది.

ఈ పథకం ద్వారా తెలంగాణలో 1800 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ౨+-=జుణజూ సంస్థ లక్ష్యం పెట్టుకుంది. రైతులు, రైతు సంఘాలు, సహకార సంఘాలు, గ్రామ మండల సమాఖ్యలు ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇప్పటి వరకు కరీంనగర్ లో 46, సిరిసిల్లలో 17 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 63 ఆమోదం ఆమోదం పొందాయి. రైతులు తమ పొలాలకు అవసరానికి మించి అదనపు విద్యుత్ ను ఉత్పత్తి చేస్తే డిస్కంలకు విక్రయించి ఆదాయం కూడా పొందవచ్చు. పెద్ద ఎత్తున రైతులు ముందుకొచ్చి ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నా.

# తాజ్ పూర్ గ్రామంలో రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం



**తాజ్ పూర్ మార్చి, 28 (వెలుతురు న్యూస్ ):**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం - యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు (=ూఔజ్రూ 2025 - 26) రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఎం. గోవర్ధన్ ( రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అస్సోసియట్ డీన్ ) మాట్లాడుతూ ముందుగా తాజ్ పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో తమ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం సంశోషకరం అన్నారు. వ్యవసాయ విద్యలో భాగంగా విద్యార్థులకు 3 సంవత్సరాల చదువు తరువాత విద్యార్థులు అంత ఒక గ్రామాన్ని ఎన్నుకొని అక్కడ ఒక 6 నెలల పాటు రైతులతో ఉంటూ వారికి పంట పొలాల్లో టెక్నాలజీ పరంగా కానీ మరే ఇతర వ్యవసాయానికి సంబంధిన సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు ఉపయోగపడుతూ, విద్యార్థులకు తెలియని విషయాలు రైతుల దగ్గర నేర్చుకుని వారు చదువుకున్న చదువును రైతు సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తారని తెలిపారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన రైతు సందర్శన చాల బాగుందని వారు విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా రైతుల నుండి విద్యార్థుల పై ప్రశంసలను చూస్తుంటే వారిని గ్రామ రైతులు కుటుంబ సభ్యులుగా స్వీకరించడం చూసి వారికీ ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుత యువత సోషల్ మీడియాకి బానిసలూ కాకుండా వ్యవసాయ క్షేత్రంలోకిరావాలన్నారు. యువత రైతుగా మారితే వారు చదువుకున్న చదువుతో వ్యవసాయ రంగంలో కొత్త మార్పులు తీసుకురావొచ్చని ఇ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్, డా. డి. శ్రీలత (యాదాద్రి భువనగిరి జిల్లాలో ౨=ఎఖ కు ప్రధాన శాస్త్రవేత్త), శ్రీనివాస్ మరియు మండల రైతులు కంచి మల్లయ్య, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్ మరియు వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, భువనగిరి మండల పరిధి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు, గ్రామప్రజలు పాల్గొన్నారు

## చెన్నారెడ్డి గూడ గ్రామంలో గ్యార యాదగిరి అనారోగ్యంతో మృతి

*యాదగిరి కుటుంబానికి 17వేలరూపాయలు రూపాయలు ఆర్థిక సహాయం*

*యాదగిరి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది*



**మంచాల వెలుతురు మార్చి 28:**
మంచాల మండలం చెన్నారెడ్డి గూడ గ్రామంలోఅనారోగ్యంతో మృతి చెందిన గ్యార యాదగిరిఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి నివాసంవద్దకు వెళ్లి యాదగిరి మృ తదేహంపై పూలమాలవేసి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అనంతరం కుటుంబ స భ్యులను పరామర్శించి 17వేలరూపాయలు ఆర్థికసాయం చేసిన కాంగ్రెస్ పార్టీనాయకులు ఈ సందర్భంగా మంచాల సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీజి ల్లానాయకుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ యాదగిరి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని అన్నారు ఈకార్యక్రమంలో చెన్నారెడ్డి గూడ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖఅధ్యక్షుడు పగడాల శ్రీశైలంయాదవ్ ప్రధానకార్యదర్శి గ్యార రాజు మాజీ ఎంపిటిసి రా మావత్ లాలు నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడుగ్యార పెంటయ్య గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ఆంబోథ్ లావణ్య కాట్రోత్వారియా కాట్రోత్ మధు రత్నావత్ హరియా మాచర్ల క్రాం తి కుమార్ నాయకులు చీమల రమేష్ చీమలసురేష్ మాచర్ల సీతారాంతదితరులుపాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో అన్నదాన ప్రభువు నూకం బాలరాజ్ ముదిరాజ్ కుటుంబ సభ్యులను సన్మానించిన గ్రామ సర్పంచ్ పాలకమండలి సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు

**మంచాల వెలుతురు మార్చి 28:**


మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీరామనవమి సీతారాముల కళ్యాణమ హోత్సవంరోజు భ క్తులకు అన్నదానం ఏర్పాటుచేసిన అన్నదానప్రభువు నుకంబా లరాజ్ ముదిరాజ్ కుటుంబస భ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకం రాజుముదిరాజ్ గ్రామపంచాయతీ వార్డుసభ్యులు దేవాలయ కమిటీ సభ్యులు ఈసందర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ మాట్లాడుతూ అన్న దా న ప్రభువు నూకం బాలరాజ్ ముదిరాజ్ కుటుంబం ఆరుట్లగ్రామంలో దేవాలయాల్లో ఎలాంటి కా ర్యక్రమాలు జరిగిన నేను అన్నదానం చేస్తాను అని ముందుకొచ్చి చెప్పడంచాలా సంతోషక రమ న్నారు.దేవాలయాలో కాకుండా వినాయక చవితి దుర్గామాత ఉత్సవాలసందర్భంగా కూడానూ కం బాలరాజ్ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాడు అనిఅన్నారు గ్రామంలోని ప్రతి ఒక్క రూ అన్నదాన ప్రభువు నూకంబాలరాజ్ ముదిరాజ్ ని ఆదర్శంగా తీసుకొని గ్రామంలో ఏదో ఒక రూపంలో సేవ చేయాలి అన్నారు ఈకార్యక్రమంలో బాలరాజ్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు గ్రా మపంచాయతీ వార్డు సభ్యులు దేవాలయ కమిటీ సభ్యులు యువకులు గ్రామపెద్దలు తదితరు లు పాల్గొన్నారు

## జహీరాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జి. శ్రీనివాస్ రెడ్డి ఘన విజయం

**- పాండురంగ రెడ్డి పై 19 ఓట్ల మెజారిటీ...**

**- ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్న న్యాయవాదులు...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 28:**


సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా మరియు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 78 మంది ఓటర్లలో 75 మంది ఓటు వేయడంతో ఈ ఎన్నికలపై న్యాయవాదుల ఆసక్తి స్పష్టంగా కనిపించింది. అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో జి. శ్రీనివాస్ రెడ్డి 46 ఓట్లు సాధించి, ప్రత్యర్థి పాండురంగ రెడ్డిపై 19 ఓట్ల స్పష్టమైన మెజారిటీతో విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు ప్రకటించగా కోర్టు ప్రాంగణంలో ఆనంద వాతావరణం నెలకొంది. గెలుపొందిన అభ్యర్థికి సహచర న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక ఉపాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో గోపాల్ ముదిరాజ్ 44 ఓట్లు సాధించి, మన్నెన్న పటేల్‌పై 15 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జనరల్ సెక్రటరీ పదవికి గోపాల కృష్ణ 45 ఓట్లు సాధించి, మొహమ్మద్ ముజాహిద్‌పై 15 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జాయింట్ సెక్రటరీ పదవికి జరిగిన పోటీ ఉత్కంఠభరితంగా సాగి, సోమశేఖర్ 38 ఓట్లు సాధించి, కార్తిక్ గౌడ్‌పై ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే గెలుపొందిన అభ్యర్థులను న్యాయవాదులు పూలమాలలతో సత్కరించి అభినందించారు. కొత్తగా ఎన్నికైన కమిటీ జహీరాబాద్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని న్యాయవాదులు ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు పరిధిలో న్యాయ సేవలను మరింత మెరుగుపరచడంతో పాటు న్యాయవాదుల సంక్షేమం కోసం కొత్త కమిటీ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

**- నియామకాల్లో తీరని జాప్యం**

**- ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి**

**- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్**

**హైదరాబాద్,మార్చి28( వెలుతురు):**
పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బ్జడెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బ్జడెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷–లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# ఉపాధి హామీ పనుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోంది

**- సిరిసిల్ల జిల్లాలో సగటున 50 రోజులు కూడా పనులు కల్పించలేకపోయారు**

**- బడ్జెట్లో ఈ పథకానికి రూ.95,692 కోట్లను కేటాయించాం**

**- ప్రతి ఒక్కరికీ 125 రోజులు పని కల్పించండి**

**- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**- సిరిసిల్ల జిల్లా అంకిరెడ్డిపల్లె, ముస్తాబాద్ లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి**











**సిరిసిల్ల జిల్లా వెలుతురు మార్చి 28:**
ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకాన్ని తీసుకొచ్చినా, తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సిరిసిల్ల జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజులలోపు మాత్రమే పని కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డి పల్లె గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ. 25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముస్తాబాద్ లో రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు అంకిరెడ్డిపల్లెలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. ఏమన్నారంటే.... దేశవ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలను ధార్మిక చింతనతో నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది. ఏ గ్రామం వెళ్లినా, ఏ ఆలయం వెళ్లినా సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకలతో కళకళలాడాయి. శనివారం రోజున తంగళ్లపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో రూ. 25 లక్షల నిధులతో, ముస్తాబాద్ అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది నా పార్లమెంట్ నియోజకవర్గంలో 32 కోట్ల 13 లక్షల రూపాయలు ఖర్చు చేసి రోడ్లను నిర్మించినం. మొత్తంగా చూస్తే ఇప్పటి వరకు దాదాపు 700 కోట్ల రూపాయల నిధులను మన పార్లమెంట్ పరిధిలో ఖర్చు చేసినం. ఈసారి ( 2026-27) కేంద్ర బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన VB`G RAM G పథకానికి 95 వేల 692 కోట్లను కేటాయించినం. గ్రామీణాభివృద్ధి శాఖ బడ్జెట్ లో ఈ ఒక్క పథకానికే 40 శాతం నిధులు కేటాయించినం. మన తెలంగాణ విషయానికొస్తే... ఈ పథకం కింద 3 వేల కోట్లకుపైగా నిధులు వచ్చే అవకాశముంది. రాష్ట్రంలో సుమారు 32 లక్షల జాబ్ కార్డ్ హోల్డర్లు ఈ పథకం కింద లబ్ది పొందుతున్నారు. ఏటా 125 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చినం. కానీ తెలంగాణలో ఆశించిన విధంగా పని దినాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల జిల్లాలో ఆశించిన స్థాయిలో పనిదినాలు కల్పించలేకపోతున్నారు. ఈ జిల్లాలో 92 వేల జాబ్ కార్డులుంటే సగటున 50 రోజులలోపు మాత్రమే పని కల్పిస్తున్నారు. 6 వేలలోపు కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని దినాలు కల్పించారు. ప్రతి ఒక్కరికి ఏటా 125 రోజుల పని కల్పించేలా ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను కోరుతున్నా... ఈ పథకానికి అయ్యే వ్యయంలో 60 శాతం నిధులను కేంద్రం ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సైతం జాప్యం లేకుండా 40 శాతం నిధులను విడుదల చేయాలని కోరుతున్నా... పంచాయతీలకు, మున్సిపాలిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నయాపైసా ఇయ్యడం లేదు. కానీ నిత్యం కేంద్రంపై దుమ్మెత్తి పోయడం అలవాటైంది. మోదీ ప్రభుత్వం ఎరువుల కొరత లేకుండా కావాల్సినన్ని ఎరువులను సరఫరా చేస్తున్నా... వాటిని అందుబాటులో ఉంచడంలో రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ పెట్టడం లేదు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి లాగుల తొండలు విడుస్తా అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. 6 గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను దారి మళ్లిస్తున్నారు. కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టడాన్ని హర్షిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్య దేశం. ఎవరైనా పార్టీ పెట్టొచ్చు. ప్రజా సమస్యలపై పోరాడిన పార్టీలకే మనుగడ ఉంటుంది.

# కంచె చేను మేసినట్లుగా ఉంది

- మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా
- నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది
- మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క

**హైదరాబాద్,మార్చి28 వెలుతురు:**
అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్మ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్టక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి'



అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హరీష్ రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదేళ్లు జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్ల అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్ రావు కోరినట్లు హౌస్ కమిటీ అడగడం సరికాదని.. విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. సాండ్ మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని వివేక్ ప్రశ్నించారు. వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రషన్ కంపెనీకి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారని.. కానీ బీఆర్ఎస్ వెనక్కి పోతోందన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. ఆ కంపెనీలో మంత్రి డైరెక్టర్ కాదని.. చైర్మన్ కాదని.. ఆ కంపెనీతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారి కుటుంబ సభ్యులకు వ్యాపారం ఉంటే తప్పా అని ప్రశ్నిస్తూ.. ఆ కంపెనీ తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు సభలో సంచలన కామెంట్స్ చేశారు. తన వ్యాఖ్యలు తప్పయితే ఉరిశిక్ష వేయాలని సవాల్ విసిరారు. వ్యాపారం చేయడం తప్పు కాదని... కానీ మైనింగ్ లైసెన్స్ లేకుండా క్రషర్ నడపడం తప్పన్నారు. క్రషర్‌కు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు అనుమతి ఇవ్వాలని.. కేంద్ర పర్యావరణ అనుమతులు అవసరం లేదని హరీశ్ వెల్లడించారు. వెంటనే ప్యానెల్ స్పీకర్ బాలు నాయక్ స్పందిస్తూ.. 'హరీష్ రావు మీ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి' అని కోరారు. వెంటనే హరీశ్ రావు మైక్ కట్ చేసిన స్పీకర్.. బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌కు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో పాల్వాయి హరీశ్ మాట్లాడుతుండగా సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. మైనింగ్ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చతో అసెంబ్లీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఆర్‌బిఎల్ కుంభకోణంలో 139 కోట్ల లావావేవీలు

**- 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**- సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన బ్యాంక్ సిబ్బంది**

**కరీంనగర్,మార్చి28( వెలుతురు):**
కరీంనగర్ కేంద్రంగా సాగుతున్న ఒక భారీ అంతర్జాతీయ సైబర్ నేరాల నెట్‌వర్క్‌ను కరీంనగర్ పోలీసులు చేధించారు. స్థానిక ఆర్‌బిఎల్ బ్యాంకును వేదికగా చేసుకుని సుమారు 139 కోట్ల రూపాయల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. 'ఆపరేషన్ క్రాక్ డౌన్'లో భాగంగా సాగించిన ఈ విచారణలో మ్యూల్ అకౌంట్ల ద్వారా సాగుతున్న ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటివరకు బ్యాంకు సిబ్బందితో సహా మొత్తం 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మోసంలో విస్తుపోయే నిజం ఏమిటంటే, సాక్షాత్తు బ్యాంకు మేనేజర్ , క్యాషియర్ నేరగాళ్లతో చేతులు కలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లో బాధితుల నుండి కొట్టేసిన సొమ్మును ఈ బ్యాంకులోని కరెంట్ అకౌంట్లలోకి మళ్లించేవారు. నిందితులకు సహకరించినందుకు గాను బ్యాంకు సిబ్బంది భారీగా లబ్ది పొందినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులు సుమారు 2,000 మందితో ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, కమిషన్ల ఆశ చూపి సామాన్య ప్రజల పేరుతో ఖాతాలను తెరిపించారు. ప్రతి లక్ష రూపాయల లావాదేవీకి అకౌంట్ హోల్డర్‌కు రూ. 2,000 కమిషన్ ఇస్తూ, వారి ఖాతాలను కేవలం ఒక ముసుగులా వాడుకున్నారు. బ్యాంకులోని కరెంట్ అకౌంట్ల ద్వారా జరిగిన ఈ వందల కోట్ల లావాదేవీలు పోలీసులకు అనుమానం కలిగించాయి. ఖాతాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించగా, దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ నేరాల సొమ్ము ఇక్కడికే చేరుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ అక్రమ సొమ్ము కేవలం దేశానికే పరిమితం కాకుండా చైనా , దుబాయ్ వంటి దేశాలకు కూడా మళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆర్‌బిఎల్ బ్యాంకుతో పాటు నగరంలోని మరో రెండు మూడు ప్రైవేట్ బ్యాంకుల్లో కూడా ఇదే తరహా అక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రస్తుతం అరెస్ట్ అయిన 13 మంది నిందితులను విచారిస్తున్న పోలీసులు, ఈ చైన్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంత మంది కీలక వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతాలను ఇతరులకు వాడటానికి ఇచ్చి అనవసరమైన చిక్కుల్లో పడకూడదని, తక్కువ శ్రమతో వచ్చే అదనపు ఆదాయం వెనుక పెద్ద మోసాలు ఉండవచ్చని కరీంనగర్ పోలీస్ యంత్రాంగం హెచ్చరిస్తోంది. 'ఆపరేషన్ క్రాక్ డౌన్' ద్వారా ఈ నెట్‌వర్క్ మూలాలను పూర్తిగా చేధిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

# 31నే గణపతి లొంగుబాటు

**వరంగల్, మార్చి28( వెలుతురు):**



మావోయిస్టు అగ్రనేత గణపతి త్వరలో లొంగిపోనున్నట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతుంది. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ నేపాల్ లో ఉన్నారని నిఘా వర్గాల నుంచి సమాచారం. అయితే ఇటీవల కాలంలో ఆపరేషన్ కగార్ ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన తర్వాత వందల సంఖ్యలో మావోయిస్టు నేతలు హతమయ్యారు. అనేక మంది అగ్ర నేతలు, తమ అనుచరులు, ఆయుధాలతో సహా లొంగిపోయారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులకు లొంగుబాటు కోసం విధించిన గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. అంటే ఇంకా నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది.అయితే ఇప్పటి వరకూ లొంగిపోయిన అగ్రనేతలు చాలా వరకూ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారికి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ముందు?కు వచ్చింది. అయితే మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత రామన్న అలియాస్ గణపతి అలియాస్ లక్ష్మణరావు ఈ నెల 31వ తేదీన లొంగిపోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు తెలంగాణ పోలీసులకు ముందుగానే గణపతి ససమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఆయనపై కోట్ల రూపాయల రివార్డు ఉంది. పలు కీలక కేసుల్లో నిందితుడిగా ఉన్న గణపతి లొంగితే మావోయిస్టు పార్టీ దాదాపుగా తుడిచిపెట్టుకు పోయినట్లేనని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న గడువు ఈ నెలాఖరుతో ముగియనుండటంతో గణపతి నేరుగా నేపాల్ నుంచి హైదరాబాద్ కు చేరుకుని తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇప్పటికీ ఒడిశా, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఆపరేషన్ నిర్వహిస్తుంది. సాయుధ బలగాలు జల్లెడ పడుతూనే ఉన్నాయి. ఈ నాలుగు రోజుల్లో ఎన్ కౌంటర్లతో పాటు లొంగుబాట్లు కూడా ఉంటాయని చెబుతున్నారు. మిసిర్ బిస్రా అలియాస్ భాస్కర్ ఝార్ఖండ్ లో ఉన్నారని గుర్తించిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వ వరా ల నుంచి అందుతున్న సమాచారమ మేరకు గణపతి లొంగిపోయేందుకు తన అంగీకారాన్ని తెలిపినట్లు చెబుతున్నారు.

# కారు వరుస కష్టాలెన్నో...




**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**
తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ రానున్న ఎన్నికల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంటుంది. కేవలం ప్రత్యర్థులతో మాత్రమే కాదు.. ఇంటి పార్టీ నుంచి కూడా కారు పార్టీకి కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడనున్నాయి. అలాగే కాంగ్రెస్ కూడా బలంగా కనిపిస్తుంది. రెండో సారి కూడా తమదే అధికారమన్న ధీమాతో ఆ పార్టీ నాయకత్వం ఉంది. బీజేపీని తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. ప్రతి రాష్ట్రంలో వరసగా అధికారాన్ని చేజిక్కించుకుంటూ వస్తున్నకమలం పార్టీ ఈసారి కారు పార్టీకి గట్టి ఛాలెంజ్ ను ఎదుర్కొనాల్సి ఉంటుంది.ఇక కల్వకుంట్ల కుటుంబం నుంచి కవిత బయటకు వచ్చేశారు. వచ్చే నెల 25వ తేదీన కొత్త పార్టీని ప్రకటించనున్నట్లు కవిత తెలిపారు. దీంతో ఆమె కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్, బీజేపీలనుకూడా లక్ష్యంగా చేసుకుంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఇప్పటికే అధికారంలో ఉండటంతో ఆ రెండు పార్టీలపై విమర్శలను ఒకవైపు చేస్తూనే, తాను తెలిసిన, తాను ఎరిగిన బీఆర్ఎస్ పాలనలో అవినీతిని కవిత ఎన్నికల వేళ బయటపెట్టే అవకాశాలున్నాయి. మిగిలిన పార్టీల విమర్శల కంటే కవిత చేసే విమర్శలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను రాజకీయంగా ఇబ్బంది పెట్టనున్నాయి.పక్కన పెడితే మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనంలోకి ఇప్పటి వరకూ రాలేదు. ప్రజా సమస్యలపై పెద్దగా స్పందించింది లేదు. ఆయన ఫామ్ హౌస్ దాటి బయటకు రావడం లేదు. గతంలో మాదిరిగా తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన వ్యక్తిగా ఉన్న ఇమేజ్ వచ్చే ఎన్నికలకు ఉండదనేది విశ్లేషకుల అంచనా. ఈ సారి ఎన్నికల్లో అనేక కారణాలు ఓటర్లపై ప్రభావం చూపుతాయి. సంక్షేమ పథకాలు ఎప్పుడూ మొదటి స్థానంలోనే నిలిచినా, అభివృద్ధితో పాటు అధికార పార్టీపై సహజంగా వెలువడే వ్యతిరేకతను సొమ్ము చేసుకోవాలంటే ఖచ్చితంగా కేసీఆర్ యాక్టివ్ కావాల్సిందేనన్నది రాజకీయ విశ్లేషకుల మాట. మరి కేసీఆర్ ఎన్నికల సమయానికి జనం ముందుకు వస్తే అది పెద్దగా సత్ఫలితాలనివ్వకపోవచ్చు.

# యుద్ధం... పర్యాటకానికి ఊతం

**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**




భారత్ అత్యంత సుందరమైన దేశం. మన దేశంలో చారిత్రక, పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఏటా లక్షల మంది మన దేశానికి పర్యాటకులుగా వస్తున్నారు. మన దేశీయులు కూడా ఏటా సెలవుల్లో పర్యాక, పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్తుంటారు. మన దేశం నుంచి కూడా విదేశాలకు వెళ్తుంటారు. అయితే తాజగా పశ్చిమాసియా యుద్ధ భయాలు గల్ఫ్ దేశాల సందర్శనలకు బ్రేక్ పడింది. 40?50 శాతం పర్యాటకులు తగ్గారు. భద్రతా ఆందోళనలతో విమాన టికెట్లు, హోటళ్ల రద్దులు పెరిగాయి. దీని ప్రభావంతో భారతీయుల వేసవి ప్రణాళికలు మారుతున్నాయహిమాచల్, ఉత్తరాఖండ్, లద్దాఖ్ ప్రాంతాల్లో బుకింగులు 30 శాతం పుంజుకున్నాయి. రిషికేశ్, షిల్లాంగ్, మనాలీలో చల్లని వాతావరణం వేసవి సెలవులకు ఆకర్షణగా మారాయి. 65% పర్యాటకులు దేశీయ ప్రదేశాలను ఎంచుకుంటున్నారు.దేశంలో 23 శాతం మంది ఆధ్యాత్మిక కేంద్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. హరిద్వార్, బద్రీనాథ్, కైలాస్ మానసరోవర్ మార్గాలు జనాదరణ పొందుతున్నాయి. ఈ మార్పు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలకు పునరుజ్జీవనం తీసుకొస్తోంది.ఇక విదేశాలకు వెళ్లాలనుకునేవారు గల్ఫ్ దేశాలకు ప్రత్యామ్నాయంగా వియత్నాం, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేసియా వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో ఆయా దేశాలకు టూర్ డిమాండ్ 25 శాతం పెరిగింది. ట్రావెల్ ఏజెన్సీలు ఈ దేశాల్లో ప్యాకేజీలను తగ్గించి, భారతీయులను ఆకర్షిస్తున్నాయి.స్వదేశ పర్యటన పెరుగుదల హోటళ్లు, రవాణా, స్థానిక వ్యాపారాలకు రూ.15 వేల కోట్ల ఆదాయం వస్తుంది. గల్ఫ్ రద్దులు దేశీయ టూరిజానికి బూస్ట్ ఇచ్చింది. టోల్ ఫీజు పెరుగుదల, మొహర్ ప్రమాదాలు సవాళ్లుగా మిగిలాయి. దీర్ఘకాలంలో ఇది టూరిజం వైవిధ్యీకరణకు దారి తీస్తుంది.

# టెన్త్ ఎగ్జామ్స్ యధావిధిగా ఉంటాయి

**- క్లారిటీ ఇచ్చిన విద్యా కమిషన్**

**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**



తెలంగాణలో టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ జరుగుతున్న సమయంలో వచ్చే ఏడాది నుంచి వీటిని రద్దు చేస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. తెలంగాణలో సెకండరీ స్కూల్ సర్టిఫికేట్ పరీక్షలను రద్దు చేస్తున్నారనే వదంతులపై తెలంగాణ విద్యా కమిషన్ క్లారిటీ ఇచ్చింది. ప్రభుత్వ పరిశీలనలో అటువంటి ప్రతిపాదనేదీ లేదని ుఇఅ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం 2026 విధాన పత్రాన్ని విడుదల చేసిన తర్వాత తెలంగాణలో ూఅ పరీక్షల రద్దుపై పుకార్లు మొదలయ్యాయి. ఆ డాక్యుమెంట్‌లో ఎస్ఎస్‌సి బోర్డును ఇంటర్మీడియట్ బోర్డుతో విలీనం చేయడం వంటి సంస్కరణలను సూచించారు. పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేయాలని ఎక్కడా సూచించలేదు. అయితే, కొన్ని ప్రైవేట్ స్కూల్స్ 11, 12 తరగతులను స్కూల్లో మొదలుపెట్టాయి. దాంతో టెన్త్ బోర్డ్ ఎగ్జామ్స్ రద్దు అని వదంతులు త్వరగా వ్యాపించాయి.తెలంగాణ రాష్ట్రంలో మార్చి 14న ప్రారంభమైన పదో తరగతి బోర్డు పరీక్షలు ఏప్రిల్ 16 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలను ప్రభుత్వం 6 పేపర్ల విధానంలో నిర్వహిస్తోంది. ప్రతి రోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు (3 గంటల పాటు) పరీక్షలు జరుగుతాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 2,676 ఎగ్జామ్ సెంటర్లలో సుమారు 5,28,239 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. నిబంధనల విషయానికి వస్తే, విద్యార్థులకు కేవలం 5 నిమిషాల ఆలస్య అనుమతి మాత్రమే ఉంటుంది. పరీక్షలు ముగిసిన అనంతరం, ఫలితాలను ఏప్రిల్ చివరి వారం లేదా మే 2026లో విడుదల చేసే అవకాశం ఉంది.తెలంగాణ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు.జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో ప్లస్ టూ (+2) విద్యా విధానాన్ని మరింత పటిష్టం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. విద్యా సంస్కరణలపై నియమించిన కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోందని, వారు సమర్పించేది ప్రాథమిక నివేదిక మాత్రమేనని, అది తుది నిర్ణయం కాదని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.ప్రస్తుతం పదో తరగతి బోర్డు పరీక్షల రద్దుపై ప్రభుత్వం ఎటువంటి అధికారిక ఉత్తర్వులు (ఉూ) జారీ చేయలేదు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చే సిఫార్సులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది. తెలంగాణలో టెన్త్ పరీక్షల రద్దుపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని, విద్యార్థులు తమ ప్రిపరేషన్‌ను యథావిధిగా కొనసాగించాలని సూచించారు.

# కారులో మంటలు.. క్షణాల్లో వాహనం దగ్ధం

**హైదరాబాద్ మార్చి28( వెలుతురు):**
హైదరాబాద్లోని పెద్దగోల్కొండ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై కదులుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కారులో మంటలను గుర్తించిన డ్రైవర్ వెంటనే వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి దిగిపోయాడు. అయితే క్షణాల్లోనే మంటలు వ్యాపించడంతో వోల్క్స్వాగన్ కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో అక్కడి ప్రాంతంలో కొంతసేపు ఆందోళన నెలకొంది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# గాలివాన బీభత్సం.. అగ్ని ప్రమాదం

**అదిలాబాద్ మార్చి28( వెలుతురు):**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి వీచిన బలమైన గాలుల కారణంగా, టీచర్స్ కాలనీలోని హనుమాన్ మందిరంలో రామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం వద్ద అగ్నిప్రమాదం సంభవించింది. సాయంత్రం సమయం లో గాలి దుమారం తీవ్రమవడంతో, అన్నదాన కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన పొయ్యిలోని నిప్పురవ్వలు ఎగిసిపడి, అక్కడ ఉన్న టెంటు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిసింది.

# కవితతో వచ్చేదెవరు...

**నిజామాబాద్, మార్చి28( వెలుతురు):**
తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ, ఢిల్లీ లిక్కర్ కేసులో ఆరు నెలలు జైలుకు వెళ్లొచ్చిన జాగృతి అధ్యక్షురాలు.. కల్వకుంట్ల కవితను ఆరు నెలల క్రితం బీఆర్ఎస్ బహిష్కరించింది. పార్టీ నేతలపై అవినీతి ఆరోపణలు చేయడం, అంతర్గత కుమ్ములాటల కారణంగా కవితను అధిష్టానం సస్పెండ్ చేసింది. దీంతో పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. త్వరలో కొత్త పార్టీ పెడతానని ప్రకటించారు. ఈ క్రమంలో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి ముహూర్తం ఖరారైంది. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభలో తన కొత్త రాజకీయ పార్టీని ప్రకటిస్తానని కవిత తెలిపారు.శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఈ కీలక ప్రకటన చేయడం సంతోషంగా ఉందని కవిత నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. ఈ శుభదినాన్ని ఎంచుకోవడం వల్ల పార్టీకి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఆశీస్సులు లభిస్తాయని ఆమె భావిస్తున్నారు. బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ కూడా ఏప్రిల్ 22న ఆవిర్భవించింది. అందుకే కవిత కూడా ఏప్రిల్ 20 తర్వాతనే ముహూర్తం పెట్టుకున్నారు.రాష్ట్రంలో నెలకొన్న ప్రజా సమస్యలపై



పోరాటం, సర్వోదయ తెలంగాణ సాధనే ఈ కొత్త పార్టీ ముఖ్య ఉద్దేశమని కవిత స్పష్టం చేశారు. గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాలను అధ్యయనం చేసి, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగం, రైతు సమస్యలు, మహిళా భద్రత వంటి అంశాలపై ఉద్యమిస్తుందన్నారు. అందరి అభివృద్ధి, సమాన అవకాశాలు కల్పించే పాలన లక్ష్యమని తెలిపారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరినీ కలుపుకుని ప్రయాణం చేస్తామన్నారు.ఏప్రిల్ 25 శుక్రవారం ఉదయం 10 గంటలకు మేడ్చల్ జిల్లా, మునీరాబాద్‌లో జాగృతి సభ ఉంటుంది. ఈ సభకు సుమారు లక్ష మందిని సమీకరించాలని కవిత లక్ష్యంగా పెట్టుకున్నారు అన్ని వర్గాల ప్రజలు, యువకులు, రైతులు, మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని కవిత విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తన అనుచరులకు కూడా దిశానిర్దేశం చేశారు. ఈ వేదికపై పార్టీ పేరు, జెండా, ఎజెండా ప్రకటిస్తారు. పార్టీ కమిటీని కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉందకవిత కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో మూడు ముఖ్య పార్టీల (బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ) మధ్య సరికొత్త సమీకరణాలు ఏర్పడనున్నాయి. ఇక మునీరాబాద్ సభా వేదికగా ఎంచుకోవడం వెనుక జీహెచ్ఎంసీ ఎన్నికల వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఆకర్షించే ఉద్దేశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత గతంలో ప్రకటించినట్లు పార్టీ పేరులో‘తెలంగాణ’ ఉంటుందని తెలుస్తోంది. కవిత వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట లేదా బోధన్ నుంచి పోటీ చేసే అవకాశం ఉందని సమాచారం.కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో సమీకరణలు మారనున్నాయి. సర్వోదయ భావజాలంతో, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ రాష్ట్ర భవిష్యత్తును మలచడమే ఈ పార్టీ లక్ష్యం. ఏప్రిల్ 25న మునీరాబాద్ సభతో తెలంగాణ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవనుంది.

# ఏప్రిల్ 1 నుంచి మూత పడనున్నచికెన్ షాపులు

**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**
ఇది మాంసం ప్రియులకు బ్యాడ్‌న్యూస్. ఎందుకంటే వచ్చే నెల 1 నుంచి రాష్ట్రంలో చికెన్ షాపులు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే కమిషన్, మార్జిన్ భారీగా తగ్గించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్.. ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఏప్రిల్ 1 నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌లు మూతపడనున్నాయి. దీనిపై పౌల్ట్రీ కంపెనీలు ఇప్పుడు ఏ విధంగా స్పందిస్తాయి అనేది తీవ్ర ఉత్కంఠను రేపుతోంది.ప్రస్తుతం రాష్ట్రంలో చికెన్ ధరలు మండిపోతున్నాయి. కిలో చికెన్ ఏకంగా రూ.320 నుంచి రూ.370 వరకు విక్రయిస్తున్నారు. వేసవి కాలంలో కోళ్లు చనిపోవడం, ఇతర కారణాలతో చికెన్ ధరలు భారీగా పెరిగాయి. అదే సమయంలో కోడి గుడ్ల ధరలు మాత్రం భారీగా పడిపోయాయి. కొన్ని రోజుల క్రితం ఒక్క కోడి గుడ్డు రూ.8 వరకు అమ్మగా.. ఇప్పుడు వాటి ధరలు రూ.5కు దిగి వచ్చాయి. కానీ కోడి మాంసం ధరలు మాత్రం రోజురోజుకూ పెరుగుతున్నాయి. అయినా ఆదివారం వచ్చిందంటే చాలు.. ప్రతీ ఇంట్లో మాంసం తప్పకుండా ఉండాల్సిందే. అయితే మటన్ ధరలు ఏకంగా రూ.1000 ఉండటంతో.. సామాన్యులు చికెన్‌తో అడ్జస్ట్ అవుతున్నారు. కానీ ఇప్పుడు




చికెన్ ధరలు కూడా పెరిగిపోవడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ తాజాగా మరో పిడుగు లాంటి నిర్ణయం తీసుకుంది. చికెన్ దుకాణాలకు ఇచ్చే మార్జిన్, కమిషన్‌ను పౌల్ట్రీ కంపెనీలు భారీగా తగ్గించడంతో వారు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే పౌల్ట్రీ కంపెనీల నిర్ణయంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాప్‌లను మూసివేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 1వ తేదీ నుంచి తెలంగాణలో చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు.ఏప్రిల్ 1 నుంచి చికెన్ దుకాణాలు బంద్ చేయడానికి సంబంధించి ఇప్పటికే హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పౌల్ట్రీ కంపెనీలు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల కారణంగా చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. మార్జిన్, కమిషన్ పెంచే వరకు తాము చేస్తున్న పోరాటాన్ని ఆపేది లేదని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చికెన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ.. అమ్మకం దారులకు వచ్చే లాభాలు మాత్రం భారీగా తగ్గిపోయాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. వేసవి కాలం, ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు.. ఆ భారం అంతా తమపైనే పడుతోందని చికెన్ షాప్ యజమానులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు వెంటనే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. లేకపోతే తాము చేస్తున్న నిరసనను కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు తీవ్రంగా హెచ్చరించారు

# 11 నగరాల్లో ఈ బస్ సౌకర్యం

**తిరుపతి, మార్చి28( వెలుతురు):**
ఏపీకి కేంద్రం నుంచి ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. కేంద్రం అందిస్తోన్న పీఎం ఈ-బస్ సేవా పథకంలో భాగంగా మొదటి దశలో 11 నగరాల్లో 750 విద్యుత్ బస్సులు రాబోతున్నాయని సీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పీఎం ఈ బస్ సేవా పథకం పూర్తి స్థాయిలో వినియోగానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు త్వరలోనే 750 విద్యుత్ బస్సులు రాబోతున్నాయన్నారు సీఎస్ సాయిప్రసాద్. ఈ విద్యుత్ బస్సులకు అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కేంద్రం ఏపీకి పీఎం ఈ బస్ సేవా పథకం కింద 750 బస్సులు కేటాయించిందన్నారు.. వీటిని రాష్ట్రంలోని 11 నగరాల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సీఎస్ సూచించారు. ఈ బస్సుల్ని నడిపేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు సీఎస్. రాష్ట్రంలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి వస్తే.. ఇంధన పొదుపుతో పాటుగా



కాలుష్యం నియంత్రణలో ఉంటుందన్నారు. విద్యుత్ బస్సులకు కావాల్సిన మౌలిక వసతుల కోసం మొత్తం 12 డిపోల పరిధిలో 129.51 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు రవాణాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు. ఈ నిధుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం భరిస్తున్నాయన్నారు. ఈ విద్యుత్ బస్సుల్ని విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ, అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు నగరాల్లో ఈ-బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు ఆర్టీసీ అధికారులు. ఇప్పటికే తిరుపతిలో 100 విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో 15 ఏళ్లు దాటిన బస్సులను పూర్తిగా తొలగించాలని సీఎస్ అధికారులకు సూచించారు.మరోవైపు ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారందరికి ఎస్‌బీఐ జనరల్ హెల్త్ ఇన్స్యూరెన్స్పథకం ప్రారంభమైంది. ఆర్టీసీ ఎండీ ఎన్.బాలసుబ్రమణ్యం బ్రోచర్, సర్క్యులర్‌ను ఆవిష్కరించారు. ఈ బీమా పథకం ద్వారా ఆకస్మికంగా అనారోగ్య పరిస్థితుల్లో ఉద్యోగులపై ఆర్థిక భారం పడకుండా, మెరుగైన చికిత్స పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు ఎండీ. దీనిలో కూడా రెండు పథకాలు (సాఫ్‌హైర్ క్లాసిక్ పాలసీ, సాఫ్‌హైర్ సూపర్ టాప్‌అప్ పాలసీ) ఉన్నాయన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఈ రెండింటిలో ఏదైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్టీసీ ఉద్యోగి, భార్య/భర్త, వారి ఇద్దరు పిల్లలు వైద్యం పొందొచ్చు. ఈ పాలసీలో రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కవరేజ్.. ఒకసారి చేరితే, ఉద్యోగ విరమణ తర్వాత కూడా కొనసాగించొచ్చు.

## మళ్లీ మొదటికొచ్చిన ఎమ్మెల్యేల ఫిరాయింపుల కథ



**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పు వెలువరించినా.. ఈ వ్యవహారం మళ్లీ హైకోర్టుకు ఎక్కింది. స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ.. పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా ఆ పిటిషన్లను స్వీకరించిన తెలంగాణ హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని.. తాజాగా ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చింది. ఇక ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు ఇవ్వడం గమనార్హం.తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి రావడం లేదు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. తన నిర్ణయాన్ని ఇటీవలె వెలువరించారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంటూ.. వారిపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లను అన్నింటినీ కొట్టిపారేశారు. అయితే ఈ వ్యవహారం అంతటితో ఆగడం లేదు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. మళ్లీ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ క్రమంలోనే పిటిషనర్లు చేసిన వాదనలను విన్న తెలంగాణ హైకోర్టు.. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాజాగా కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై పిటిషన్‌లు దాఖలు అయ్యాయి.ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చింది. ఈ పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో పూర్తి అయిపోయింది అనుకున్న తెలంగాణ పార్టీ ఫిరాయింపుల కేసు మళ్లీ మొదటికి వచ్చింది.మరోవైపు.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ఇటీవలె హైకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్.. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ దానం నాగేందర్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టేశారని.. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఇచ్చిన తీర్పును కొట్టేయాలని తన పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

# ప్రాణం తీస్తున్న వేగం

**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**
విశాలమైన రోడ్డు.. ఏమాత్రం గతుకులు ఉండవు. వేగంగా దూసుకుపోవచ్చు. ధ్వని వేగంతో సమానంగా వాహనాన్ని నడపవచ్చు. అందువల్లే చాలామంది బాహ్య వలయ రహదారి మీద ప్రయాణించడాన్ని ఆనందిస్తుంటారు. ఔటర్ కేవలం రోడ్డు మాదిరిగానే కాకుండా.. చుట్టూ వృక్షాలు.. పూల మొక్కలతో కనువిందు చేస్తూ ఉంటుంది. అందువల్లే ఆ ప్రకృతిని చూస్తూ చాలామంది వేగంతో వెళ్తూ ఉంటారు.ఔటర్ రింగ్ రోడ్డు మీద స్పీడోమీటర్లు ఉన్నప్పటికీ చాలామంది వేగాన్ని ఆస్వాదిస్తూ ముందుకు వెళ్తుంటారు. అందువల్ల ట్రాఫిక్ చలాన్లకు గురవుతూ ఉంటారు. ఆ మధ్య మహేష్ బాబు ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో వెళ్లడంతో.. చలాన్ నమోదయింది. దీనిని బట్టి ఔటర్ రింగ్ రోడ్డు మీద సెలబ్రిటీలు.. ప్రజా ప్రతినిధులు ఏ స్థాయిలో ప్రయాణం సాగిస్తుంటారో అర్థం చేసుకోవచ్చు.ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్సీ అజహారుద్దీన్ కుమారుడు తన విలాసవంతమైన బైక్ మీద అవుటర్ రింగ్ రోడ్డు మీద ప్రయాణించాడు. మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో అతడు దుర్మరణం చెందాడు. అప్పట్లో సినీ హీరో రాజశేఖర్ కారు కూడా ప్రమాదానికి గురైంది. దాని కారణం కూడా మితిమీరిన వేగమని తెలుస్తోంది. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఎమ్మెల్యేగా ఉన్న ఆమె ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగంతో వెళ్లడంతో.. ప్రమాదం జరిగింది. అప్రమాదంలో లాస్య నందిత చనిపోయింది.ఇప్పుడు దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుమార్తెలు ఔటర్ రింగ్ రోడ్డు మీద ప్రయాణిస్తుండగా.. వారి వాహనం ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టడంతో వారి ప్రయాణిస్తున్న కారు ధ్వంసం అయింది. మాగంటి గోపీనాథ్ ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె అక్షర తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె అత్యంత విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గచ్చిబౌలి లోని ఏఐజి ఆసుపత్రిలో ఆమెకు చికిత్స అందిస్తున్నారు.. ఔటర్ రింగ్ రోడ్డు మీద ప్రజాప్రతినిధులు ఇలా వరుసగా గాయపడడం లేదా మృతి చెందడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్న తీరుగ్భ్రాంతి కలిగిస్తోంది.

## దీదీ దిమ్మ తిరిగే ప్లాన్ వేసిన బీజేపీ..!

**కోల్ కత్తా, మార్చి28( వెలుతురు):**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అన్నింటికన్నా కీలకమైనది పశ్చిమబెంగాల్. ఇక్కడ 15 ఏళ్లుగా తృణమూల్ పాలన కొనసాగుతోంది. నాలుగోసారి ఎన్నిక కావడానికి మమత సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈసారి పాగా వేయాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. గత ఎన్నికల్లో మమత ఓడిపోతుందని ఎగ్జిట్‌పోల్స్ తెలిపాయి. కానీ మమత హ్యాట్రిక్ కొట్టారు. ఈసారి ఏడు అంశాలు ఎన్నికలను ప్రభావితం చేయబోతున్నాయి. 2021లో టీఎంసీకి 213 సీట్లు, బీజేపీకి 77 సీట్లతో రెండో స్థానం సాధించింది. అయితే ఈ ఎన్నిల్లో మమతా బెనర్జీకి ఏడు సవాళ్లు ఎదురవుతున్నాయి.ఎన్నికల సంఘం 1.5 లక్షల మంది భద్రతా సిబ్బందిని రంగంలోకి దించి గుండా రిగ్గింగ్‌ను అరికట్టుతోంది. గతంలో టీఎంసీకి అనుకూలంగా ఉన్న సీఎస్, డీజీపీ, పోలీస్ అధికారులను బదిలీ చేసి అధికారాలను పరిమితం చేసింది. ఇది టీఎసీకి పెద్ద దెబ్బగా మారుతోంది.గేటెడ్ కమ్యూనిటీల్లో బూత్‌లు ఏర్పాటు చేయడంతో ఓటర్లు బెదిరింపు భయం లేకుండా ఓటు వేయగలరు, గుండా ప్రభావం తగ్గుతుంది. ప్రతి బూత్‌లో లైవ్ టెలికాస్ట్‌తో దొంగ ఓట్లు, గొడవలను ర??ల్ టైమ్‌లో పర్యవేక్షించి రీపోలింగ్‌కు అవకాశం ఏర్పడుతోంది. ఓటింగ్ శాతం 80% పైకి ఎక్కే అవకాశం ఉంది.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్)తో 68 లక్షల పేర్లు తొలగించారు ? బంగ్లాదేశ్ వలసులు, డూప్లికెట్లు, మర్మల్ ఓటర్లు, స్థానికంగా లేని వారిని గుర్తించి రద్దు చేశారు. 2021లో టీఎంసీకి 2.80 కోట్ల ఓట్లు, బీజేపీకి 2.29 కోట్లు (తేడా 60 లక్షలు), ఈ మార్పు టీఎంసీ లీడ్‌ను 5 నుంచి 10 శాతం తగ్గించవచ్చు. ముస్లిం ప్రాంతాల్లో తొలగింపులు ఎక్కువగా టీఎంసీని దెబ్బతీసే అవకాశం ఉంది.ముస్లిం ఓటర్లు 100+ సీట్లలో కీలకం, 2021లో 90 సీట్లు టీఎంసీకి వచ్చాయి. కొత్తగా ఎంఐఎం, ఏజేయూపీ, మరో ముస్లి పార్టీ జట్టు కట్టాయి. దీంతో మమతవైపు ఉన్న ముస్లిం ఓటర్లు చీలిపోయే అవకాశం ఉంది. సర్ తొలగింపులు మరింత ప్రభావితం చేస్తాయి. టీఎంసీ 30 శాతానికిపైగా మైనారిటీ ఓట్లు కోల్పోతే 20?25 సీట్లు పోతాయి.బీజేపీ 'మిషన్ బెంగాల్'లో అర్బన్, మధ్యతరగతి బెంగాలీలు, ప్రెసిడెన్సీ ఏరియాపై ఫోకస్ పెట్టింది. సువేందు అధికారి అక్కడ పోటీతో మోదీ జనాదరణను ఉపయోగించాలని. టీఎంసీ 75 అభ్యర్థులను మార్చి టికెట్లు సర్దుబాటు చేసింది, వెల్ఫేర్ స్కీమ్‌లు (లక్ష్మీ బిమా)పై ఆధారపడుతోంది. బీజేపీ అంతర్గత కలహాలు, వర్గపోరాటాలు (19.9% సర్వే రెస్పాండెంట్లు) సవాలుగా ఉన్నాయి.

# జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పుడూ ముందున్నా

- గతంలో ఉమ్మడి ఏపిలో అనేక కార్యక్రమాలు చేపట్టా
- వారికి ప్రాధాన్యక్రమంలో భూములు ఇస్తాను
- సోషల్ మీడియా వ్యక్తిత్వ హననంపై ఆందోళన
- ఐజెయూ సమవేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి 28 వెలుతురు:**
జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడడంలో తానే ముందున్నానని, ఉమ్మడి ఏపిలో అయినా, విభజిత ఏపిలో అయినా అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని సిఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ 11వ ప్లీనరీ సమావేశాల ప్రారంభ కార్యక్రమంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి కాలంలో సోషల్ మీడియా ఓ పెద్ద సవాలుగా మారిందని అన్నారు. కొందరు వ్యక్తులు కేవలం అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి, ఇతరుల వ్యక్తిత్వ హననం చేయడానికే సామాజిక మాధ్యమాలను వాడుతున్నారని మండిపడ్డారు. 'తప్పుడు ప్రచారాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరం. దీనిని ఎలా నియంత్రించాలో, ప్రజలను ఎలా చైతన్యపరచాలో మనమందరం ఆలోచించాలి. రాబోయే ఒకటి రెండేళ్లలో 3వ స్థానానికి, 2038 నాటికి 2వ స్థానానికి, 2047 లేదా 2050 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా మన దేశం ఎదిగే అవకాశముందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపోతే గతంలో హైదరాబాద్‌లో ప్రెస్ క్లబ్‌లకు, జర్నలిస్టులకు విలువైన ప్రాంతాల్లో భూములిచ్చామన్నారు. అమరావతిలోనూ పాత్రికేయుల నివాసాల కోసం భూమి కేటాయించేందుకు సానుకూలంగా పరిశీలిస్తామని భరోసానిచ్చారు. మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం సహా జర్నలిస్ట్ సంక్షేమ




నిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని పది లక్షల రూపాయలకు పెంచామని.. డెస్క్ జర్నలిస్టులకు, సబ్ ఎడిటర్లకూ అక్రిడిటేషన్, బస్సు ప్రయాణ రాయితీలు కల్పించామని చెప్పుకొచ్చారు. అమరావతిలో భూమి మానిటైజేషన్ ప్రాజెక్ట్ అయినప్పటికీ.. ఓ పద్ధతి ప్రకారం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకుంటాం. గతంలో కేవలం కమ్యూనిస్ట్ పార్టీలే తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికి సొంత పత్రికలను కలిగిఉండేవి. కానీ.. నేడు రాజకీయ నాయకులే స్వయంగా మీడియా సంస్థలను నడుపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైన ధోరణి. వృత్తిపరమైన మీడియా, రాజకీయ పార్టీల యాజమాన్యంలోని మీడియాల మధ్య స్పష్టమైన తేడా ఉండాలని నేను కోరుకుంటున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను రాజకీయాల్లో ఉన్నానని ఈ సందర్భంగా స్మరించుకున్నారు చంద్రబాబు. కరెంటులేక పొలాలు ఎండిపోతున్నాయని తాను అసెంబ్లీని వాయిదావేసి మరీ క్షేత్రస్థాయికి వెళ్లిన రోజులు గుర్తున్నాయన్నారు. '90వ దశకం చివరలో నేను విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాను. దేశం కోసం, రాష్ట్రం కోసం నేను విద్యుత్ తీసుకొచ్చినా.. దురదృష్టవశాత్తూ 2004లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ఎప్పుడూ కలిసే సాగాలి. నేడు సమాజంలో విలువలు పడిపోవడం, సిద్ధాంతాలు మారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీ.రామారావును ఒకసారి 'మీరు కమ్యూనిజమా, సోషలిజమా లేక క్యాపిటలిజమా?' అని అడిగితే.. తానొక 'ఉత్తమ మానవతావాదిని' అని ఆయన సమాధానమిచ్చారు' అని ముఖ్యమంత్రి నాటి జ్ఞాపకాలను గురించి వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి ఏపీ సీఎం మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామంటే నాడు అందరూ నవ్వుకున్నారు. కానీ పాతికేళ్ల తర్వాత నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గ్లోబల్ కాంపిటెన్సీ సెంటర్లలో 25 శాతం హైదరాబాద్‌కే వస్తున్నాయి. రాష్ట్ర విభజన కంటే కూడా 2019 నుంచి 2024 మధ్య జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా నష్టపోయింది. మళ్లీ మనం అశ్రద్ధ చేస్తే, సమస్యలు వస్తాయనే విషయం గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా మూడు రాజధానులని మాట్లాడారు. కొంతవరకు మీడియా అంతా కూడా దీనిని ఖండించారు, అయినా పట్టించుకోలేదని చంద్రబాబు చెప్పారు.

# ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తదుపరి తమ టార్గెట్ క్యూబా అంటూ హెచ్చరిక

**వాషింగ్టన్,మార్చి28( వెలుతురు):**
ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని



స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు..
# బతుకును ఛిద్రం చేసుకోవద్దు

- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్,మార్చి28( వెలుతురు):**
బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

## అత్యవసరంగా ల్యాండ్ అయిన ఇండిగో




**న్యూఢిల్లీ,మార్చి28( వెలుతురు):**
విశాఖపట్నం నుంచి ఢిల్లీకి ప్రయాణిస్తున్న ఇండిగో విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రన్‌వే 28 వద్ద అధికారులు పూర్తిస్థాయి ఎమర్జెన్సీ ప్రకటించారు. విమానాశ్రయం వద్ద ముందు జాగ్రత్తగా అగ్నిమాపక యంత్రాలు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచారు. మొత్తం 160 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఉదయం 10:59 గంటలకు సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్ వర్గాలు తెలిపాయి.

## చలో హైదరాబాద్‌కు ఆశాల పిలుపు

- ఎక్కడికక్కడే పోలీసుల అరెస్ట్

**హైదరాబాద్,మార్చి28( వెలుతురు):**
చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్‌టీయూ నేతలు, ఆశావర్కర్లు ముందస్తుగా అనుమతులు తీసుకున్నారు. కానీ ర్యాలీకి పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి బీఆర్‌టీయూ ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేసారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్; కార్యదర్శి మారయ్యను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. పోలీసుల తీరుపై ఆశావర్కర్లు, బీఆర్‌టీయూ నేతలు మండిపడుతున్నారు. ధర్నాకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఎందుకు అరెస్టు చేస్తున్నారని పోలీసులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ



రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవమిదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీరుతామని స్పష్టం చేశారు.

# చెల్లి నిర్మాత...అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్






మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

## మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

## హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో



దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది. రిషబ్ శెట్టి ఈ అంశంపై స్పందించే వరకు ఈ సస్పెన్స్ కొనసాగడం ఖాయం.

# దురంధర్-2 ఓ చెత్త సినిమా

# అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ



ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు. ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.

# పెళ్లి తర్వాత కూడా తగ్గని జోరు..

# పాన్ ఇండియా రాణిగా రష్మిక హవా!



నేషనల్ క్రష్ రష్మిక మంధాన ప్రస్తుతం తన కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని ఊహాగానాలు వచ్చినా, సినిమాల విషయంలో మాత్రం ఆమె ఎక్కడా తగ్గే ప్రసక్తే లేదని తన వరుస ప్రాజెక్టులతో క్లారిటీ ఇస్తుంది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత కెరీర్ వేగం తగ్గించుకుంటారు. కానీ రష్మిక మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే, రాబోయే రెండేళ్లు బాక్సాఫీస్ వద్ద ఆమె ఆధిపత్యం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో ఆమె క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే పుష్ప3లో శ్రీవల్లి పాత్రతో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి.సోషల్ మీడియా మార్కెటింగ్ అంతేకాదు, అల్లు అర్జున్- అట్లీ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కూడా రష్మిక పేరు వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ కన్ఫర్మ్ అయితే ఐకాన్ స్టార్‌తో ఆమెకు హ్యాట్రిక్ మూవీ అవుతుంది. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లో కూడా రష్మిక జోరు తగ్గడం లేదు. యానిమల్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్న ఆమె, దాని సీక్వెల్ యానిమల్ పార్క్‌లో మరోసారి గీతాంజలి పాత్రలో కనిపించనుంది. ఇందులో రణ్‌బీర్ కపూర్‌తో కలిసి ఆమె నటనపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇక 'కాక్టెయిల్ 2' వంటి ప్రాజెక్టులతో హిందీ ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతోంది.సినిమా టికెట్లు గ్లామర్ పాత్రలకు మాత్రమే పరిమితం కాకుండా, రష్మిక ఇప్పుడు విభిన్న కథలతో ముందుకు వస్తోంది. 'మైసా', 'రణబాలి' వంటి చిత్రాల్లో కొత్త తరహా పాత్రలతో తన నటనలోని మరో కోణాన్ని చూపించనుంది. ప్రత్యేకంగా 'రణబాలి'లో విజయ్ దేవరకొండతో కలిసి నటించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. పెళ్లి తర్వాత కెరీర్ స్లో అవుతుందని అనుకునే ట్రెండ్‌ను రష్మిక పూర్తిగా మార్చేస్తోంది. భారీ సినిమాలు, పాన్ ఇండియా ప్రాజెక్టులు, విభిన్న పాత్రలు కలిసి ఆమెను ఇండియన్ సినిమా టాప్ హీరోయిన్‌గా నిలబెడుతున్నాయి. ఏది ఏమైన , స్టార్‌డమ్ తగ్గకుండా, మరింత ఎత్తుకు తీసుకెళ్లే దిశగా రష్మిక ముందుకు సాగుతోంది. రాబోయే కాలంలో బాక్సాఫీస్‌ను షేక్ చేసే సినిమాలతో ఆమె పేరు మరింత మోగడం ఖాయంగా కనిపిస్తోంది.


# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# అమరావతి రాజధానిపై చట్టబద్ధ బిల్లు

**- ఇది చారిత్రక సన్నివేశం అన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు**
**- ఈ సమావేశానికి ఎంతో ప్రాధాన్యం ఉందని వ్యాఖ్య**



**అమరావతి, మార్చి28( వెలుతురు):**
ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం శనివారం ఉదయం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టారు. ఉదయం సరిగ్గా 11 గంటల 11 నిమిషాలకు శాసనసభలో ఈ బిల్లును సీఎం ప్రవేశపెట్టడంతో తీర్మానంపై చర్చ మొదలైంది. తీర్మానంపై 20 మందికి పైగా సభ్యులు మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. ఈ శాసనసభ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించే యజ్ఞం ఈ సమావేశంతో మొదలవుతోందని స్పీకర్ అన్నారు. 2014లో నడిసంద్రంలో చుక్కాని లేని నావలా ఆంధ్రప్రదేశ్ ఉందని.. అలాంటి సమయంలో దార్శనికుడు చంద్రబాబుకు రాష్ట్రాన్ని ప్రజలు అప్పగించారని తెలిపారు. చంద్రబాబు ప్రగతి బాటలో నడిపించాలని ప్రణాళికలు రూపొందించారన్నారు. అందరి సంప్రదింపులతో అమరావతిని రాజధానిగా ఖరారు చేశారని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులు తమ ప్రాణప్రదమైన భూములను రాజధాని కోసం విరాళంగా ఇచ్చారని తెలిపారు. అన్నదాతల అండతోనే రాజధానికి భూమి లభించిందని... అమరావతి రాజధాని పనులు వేగంగా ముందుకు సాగాయని స్పీకర్ తెలిపారు. 2019లో అమరావతికి అడ్డంకులు ఎదురయ్యాయన్నారు స్పీకర్. మూడు రాజధానుల పేరిట తప్పుడు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత నిర్ణయాలు కొనసాగించాలనే సూత్రానికి విరుద్ధంగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. చేతికి కొబ్బరికాయ చిక్కినట్లు ప్రవర్తించి, అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కు వెళ్లిందని వ్యాఖ్యానించారు. పాలకులు కూడా విధ్వంసానికి పాల్పడవచ్చని ఈ సంఘటనలు నిరూపించాయని స్పీకర్ వెల్లడించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ధృడ సంకల్పం ఫలితంగా దీనికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించిందన్నారు. ఈ మేరకు అమరావతి రాజధానిగా తీర్మానం చేసేందుకు అవకాశం వచ్చిందని తెలిపారు. తెలుగు ప్రజలు గర్వించదగ్గ రోజు ఇది అని చెప్పుకొచ్చారు. ఈ చరిత్రాత్మక సమావేశానికి 11 మంది వస్తారని అనుకున్నామని... చేసిన తప్పును ఒప్పుకునే ధైర్యం వారికి లేదని తెలిసిపోయిందన్నారు. అమరావతి తీర్మానంపై జరిగే చర్చ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. 'ఇలాంటి చరిత్రాత్మక సందర్భంలో మాట్లాడే అవకాశం మీ అదృష్టం. అందరూ అర్థవంతంగా చర్చలో పాల్గొని మాట్లాడాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.

# చీలిన ఓట్లు.. ఎవరికి తూట్లు..



**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక పెను సంచలనం ముంచుకొస్తోంది. కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కొత్త పార్టీని ప్రకటిస్తున్నారు. ఈ పరిణామం కేవలం ఒక కొత్త పార్టీ ఆవిర్భావం మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలించే ఒక వ్యూహాత్మక చీలికగా చెప్పుకోవచ్చు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న అత్యంత బలమైన ఓటు బ్యాంకులో చీలిక తేవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఒక కొత్త పార్టీగా కవిత కేవలం 4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగినా, అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారనుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దెబ్బతిన్న బీఆర్ఎస్, ఇప్పుడు కవిత రూపంలో ఎదురవుతున్న ఈ ఇంటి పోరు ను తట్టుకోవడం కష్టతరమే. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్, సాంస్కృతిక అంశాలపై పట్టున్న కవిత, బీఆర్ఎస్ కోర్ ఓటర్లను తనవైపు తిప్పుకుంటే ఆ పార్టీ కోలుకోవడం అసాధ్యం కావచ్చు.బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం కేటీఆర్ ఆధిపత్యం పెరిగిందని, సీనియర్లకు ప్రాధాన్యత తగ్గటంపై లోలోపల తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేసీఆర్ మౌనం, హరీష్ రావు ఇరకాటం వంటి పరిస్థితులతో .. పార్టీలో గుర్తింపు లేని ద్వితీయ శ్రేణి నాయకులు, టిక్కెట్లు దక్కని ఆశావాహులు ఇప్పుడు కవిత వైపు చూస్తున్నారు. కవిత పార్టీ ప్రకటన వెలువడగానే, బీఆర్ఎస్ నుండి భారీగా వలసలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. అవకాశాలు రాని నేతలకు కవిత ఒక ప్రత్యామ్నాయ వేదికగా మారడం బీఆర్ఎస్ క్యాడర్‌ను నిలువునా చీల్చనుంది.కేటీఆర్, హరీష్ రావుల తీరుపై గుర్రుగా ఉన్న కవిత, తనపై జరిగిన రాజకీయ కుట్రలకు ప్రతీకారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ కవితతో సర్దుకుపోయే ప్రసక్తే లేదని సంకేతాలిస్తుంటే, అటు తండ్రిగా కేసీఆర్ వారించలేక, ఇటు పార్టీని కాపాడుకోలేక మౌనం వహిస్తున్నారు. ఈ అంతర్గత కలహాలు బీఆర్ఎస్ బలహీనపడటానికి ప్రధాన కారణం కానున్నాయి. కవిత పార్టీ పెట్టడం వెనుక ఉన్న బలమైన ఉద్దేశ్యం అధికారం కంటే కూడా, తనను దూరం పెట్టిన బీఆర్ఎస్ నేతలకు ఒక గట్టి పాఠం చెప్పడమేనని అర్థమవుతోంది. కవిత చేయబోయే అధికారిక ప్రకటనతో తెలంగాణలో సరికొత్త సమీకరణాలు మొదలవుతాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ నుండి బయటపడిన తర్వాత బాధితురాలిగా ప్రజల్లోకి వెళ్లాలని ఆమె యోచిస్తున్నారు. వ్యక్తిగా వెళ్తున్నాను.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తాను అన్న ఆమె నినాదం ఇప్పుడు బీఆర్ఎస్ అధినాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కవిత చీల్చే ప్రతి ఓటు కూడా బీఆర్ఎస్ విజయవకాశాలను దెబ్బతీస్తూ, పరోక్షంగా ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించే పరిష్కారం బీఆర్ఎస్ వద్ద కనిపించడం లేదు.

## గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

**- వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు**



**భద్రాచలం, మార్చి28( వెలుతురు):**
భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## మంటలు చెలరేగి కారు దగ్ధం



**యాదాద్రి భువనగిరి, మార్చి28( వెలుతురు):**
బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగా దగ్ధమైంది.


## వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగుల మృతి

**- ఆకస్మిక గుండెపోటుతో మృతిపై ఆందోళన**




**హైదరాబాద్, మార్చి28( వెలుతురు):**
హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది. తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు. ఇలా వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడంతో నార్మ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## భారంగా మారుతున్న రోజా



**తిరుపతి, మార్చి28( వెలుతురు):**
మాజీ మంత్రి ఆర్కే రోజా వంటి వారితో వైసీపీకి లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుంది. ఇటీవల ఆమె చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పై చేసిన వ్యాఖ్యలతో పార్టీకి నష్టమేనంటున్నారు. రోజా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారని, ఆమెను అదుపులో పెట్టాల్సిన పార్టీ నాయకత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తే మరింత డ్యామేజీ కాక తప్పదని హెచ్చరిస్తున్నారు. అనవసర విషయాల్లో వేలుపెట్టడం రోజాకు అలవాటు. సినిమా డైలాగుల్లా రాజకీయనేతలు మాట్లాడితే అవి వికటిస్తాయని అంటున్నారు. పాలు పితకడం వంటి వ్యాఖ్యలతో వైసీపీకి మరింత నష్టం చేకూరిందని అంటున్నారు.వైసీపీకి మాజీ మంత్రి రోజా రోజురోజుకూ భారంగా మారుతున్నారు. నేతల అరెస్ట్ లతో కాస్తో కూస్తో వైసీపీకి సానుభూతి లభిస్తుందని భావిస్తే, రోజా తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో అవి కనపడకుండా పోతున్నాయని, రోజా వ్యాఖ్యలను ఎవరూ హర్షించకపోవడమే కాకుండా ప్రజలను పార్టీకి మరింత దూరం చేసే విధంగా ఉందని అంటున్నారు. రోజా లాంటి నేతల నోళ్లను కొన్నాళ్లపాటు అదుపులో పెట్టకపోతే జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తీరని నష్టం జరుగుతుందన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. కానీ రోజా విషయంలో జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఆమె మరింత రెచ్చిపోతున్నారు.ఆర్కే రోజా తొలుత తనను అరెస్ట్ చేస్తారేమోనని భయపడి కొన్నాళ్లు రాజకీయాలకు దూరంగా ఉన్నారు.కానీ తనపై ఎలాంటి కేసులు నమోదు కాకపోవడంతో పాటు కూటమి ప్రభుత్వం కూడా చూసీ చూడనట్లు వదిలేయడం వల్ల రోజా ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారని అంటున్నారు. అధికార పార్టీ కొద్దో గొప్పో వస్తున్న వ్యతిరేకతను రోజా లాంటి నేతలు తమ మాటలతో కప్పిపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వైసీపీ నేతల్లోనూ వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా జగన్ రోజాను కట్టడి చేయకపోతే వైసీపీకి రానున్న కాలంలో మరింత ఇబ్బందులు తప్పవంటున్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com